# శ్రీచరణామృతము

## శ్రీనివాసుని దివ్యపాద వైభవం



తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన

వేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి

# శ్రీచరణామృతము

# శ్రీచరణామృతము

పూర్వకాలంలో కోసలరాజ్యంలో వేంకటాపురం అనే గ్రామంలో రామాచారి అనే ఎంతో నిష్ఠాగరిష్ఠుడైన సద్బ్రాహ్మణుడు నివసించేవాడు. స్వతహాగా విష్ణుభక్తుడైన రామాచారి ఆ వూరిలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో అర్చకత్వం నిర్వర్తిస్తూ కాలం వెళ్ళబుచ్చుతుండేవాడు. భార్య సుమతి అతడికి అన్ని విధాలా సహకరిస్తూ వుండేది. వేంకటాపురంలోని ప్రజలందరూ ఎంతో సహాయ సహకారాలతో జీవిస్తూ సత్కార్యాలు నిర్వహిస్తూ దైవచింతనలో కాలం గడుపుతుండేవారు. శ్రీ స్వామివారి దేవాలయం నిత్య కళ్యాణం పచ్చ తోరణంలా శోభిల్లుతుండేది. పండుగలకు ఆలయమంతా ఎంతో చక్కగా అలంకరించబడేది. శ్రీనివాసుని దివ్య మంగళ విగ్రహాన్ని ఎంతో అద్భుతమైన పుష్పాలతో దివ్యంగా అలంకరించేవారు.

రోజులు ఇలా గడుస్తుండగా చైత్రమాసం వచ్చింది. ఈ నెలలోనే శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు ప్రతీ సంవత్సరం ఎంతో గొప్పగా జరుపబడతాయి. ఈసారి కూడా రంగరంగ వైభవంగా జరపాలని గ్రామస్తులందరూ నిశ్చయించుకున్నారు. ఈ పదిరోజులు గ్రామం మొత్తానికీ పండగే. ఇక రామాచారి దంపతుల విషయమైతే చెప్పనక్కరలేదు. ప్రతీ సంవత్సరం బ్రహ్మోత్సవ రోజులలో శ్రీ స్వామి వారి మూలవిగ్రహాన్ని ప్రతీరోజు రకరకాల పుష్పాలతో దివ్యంగా అలంకరిస్తూ ప్రత్యేక నివేదనలు గావిస్తూ రోజూ ఊరేగింపులో వెళ్ళే ఉత్సవ మూర్తులను కూడా ఎంతో అద్భుతమైన పూలతో అలంకరిస్తూ మురిసిపోయేవాడు. ఈ సంవత్సరం బ్రహ్మోత్సవ అంకురార్పణసమయం రానే వచ్చింది. ఆ రోజు శ్రీనివాసుడు దివ్యాలంకార శోభితుడై అద్భుత తేజస్సుతో వెలిగిపోతూ భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఆ స్వామి దివ్య మంగళ విగ్రహాన్ని దర్శించిన భక్తుల సంతోషం ఇంతా, అంతా అని చెప్పనలవి కాదు. ఇక రామాచారి దంపతుల ఆనందానికి అంతే లేదు! ఆహా! శ్రీమన్నారాయణా! ఎంత అద్భుతంగా వెలిగిపోతున్నావయ్యా! ఈ సృష్టిలోని అందమంతా నీదే కదా! ఈ సృష్టి మొత్తం వ్యాపించి వున్న ఓ శ్రీమన్నారాయణా! నీకివే నా నమస్కారములు. ఆద్యంత రహితుడవు, అనాధ రక్షకుడవు, ఆపద్బంధవుడవు,

నమ్మినవారికి కొంగు బంగారమై నిన్నే నమ్మి సేవించేవారికి సర్వసౌభాగ్యాలూ అనుగ్రహించే అమృతమూర్తివి. ఆహా! శ్రీనివాసా మా ఆలయంలో ఎంతో అద్భుతంగాద ర్శనమిస్తూవ ఁమ్ములనందరినిఅ లరిస్తున్ననీ కివేవ ాన మస్కారములు అని రామాచారి శ్రీనివాసుని దివ్య గుణగణాలను ప్రశంసించాడు.

అంకురార్పణకార్యక్రమం ఎంతో వైభవోపేతంగా జరిగింది. గ్రామంలోని ప్రజలందరూ ఆ కార్యక్రమంలో ఎంతో ఆనందంతో పాల్గొని స్వామిని సేవించుకున్నారు. రామాచారి దంపతులు కార్యక్రమాలన్నీ అయిన తరువాత ఇంటికి చేరుకుని నిద్రకు ఉపక్రమించారు. ఆ శ్రీనివాసుని దివ్య మంగళ విగ్రహాన్నే తలుస్తూ కనులు మూసుకున్న రామాచారికి కలలో శ్రీనివాసుని దివ్య చరణాలు దర్శనమిచ్చాయి. ఎంతో తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ దివ్య చరణాలను దర్శించిన రామాచారి ఆనందానికి అంతు లేదు. సాక్షాత్తూ సృష్టికర్త అయిన ఆ చతుర్ముఖ బ్రహ్మ కడిగిని పాదములే కదా ఇవి! సిరుల తల్లి శ్రీమహాలక్ష్మి నిత్యమూ సపర్యలు చేసే దివ్య పాదములు ఇవే కదా! ఓ శ్రీనివాసా! నీ దివ్య పాద దర్శనంచే నా జన్మ ధన్యమైంది. ఈ పాద దర్శనమునకే కదా సమస్త మునిగణమూ ఎదురు చూచుచున్నది. ఆహా! నా భాగ్యం ఎంతని చెప్పను' అని రామాచారి కలలో ఆ స్వామితో అంటుండగా స్వామి చతుర్భుజములతో దివ్య మంగళరూపంలో దర్శనమిచ్చాడు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు రామాచారితో ఇలా అన్నాడు. ఓ రామాచారి నా ప్రియభక్తుడవైన నీవంటే నాకెంతో ఇష్టం. నీ భక్తికి నాకెంతో సంతోషం కలిగినది. వేరే ఎటువంటి ఆలోచనలూ లేకుండా సర్వకాల సర్వావస్థలయందు నన్నే తలుస్తున్న నీవంటే నాకెంతో ఆప్యాయత. నీవు నాకు అత్యంత ప్రియభక్తుడవు. ఈ బ్రహ్మోత్సవములు పూర్తికాగానే నీవు సతీ సమేతముగా తిరుమల యాత్ర సంకల్పింపవలసింది. నా అనుగ్రహంచేత వేంకటాద్రిపై నీకు నా దివ్య పాద దర్శనం లభింపగలదు. కొండనెక్కుతున్నప్పుడు సప్తఋషులు నీకు అనేక రూపములలో దర్శనమిస్తూ నా లీలలను వివరంగా చెప్తారు. అన్నింటినీ శ్రద్ధగా ఆలకించి తిరుమల చేరి ఆనంద నిలయంలో నన్ను దర్శింపవలసింది, అప్పుడు నేను

నీకు నా దివ్యదర్శన భాగ్యాన్ని కలుగజేస్తాను అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

మెలకువ వచ్చిన రామాచారి ఆనందానికి అంతు లేదు. వెంటనే భార్య సుమతిని లేపి కలలో జరిగిన విషయాలన్నీ చెప్పాడు. సుమతి ఎంతో సంతోషించింది. ఆ శ్రీమన్నారాయణులవారు తమను అనుగ్రహించినందుకు ఆ స్వామిని ఎన్నో విధాల స్తుతించింది. ఓ శ్రీనివాసా! నీవెంతటి భక్తవత్సలుడవయ్యా, అతిసామాన్యులమైనవ నాకుఎ ంతటిభాగ్యాన్నిప్రసాదించావుతండ్రీ. మేమునీ కు ఎటువంటి కానుకలూ ఇవ్వలేదే? మహాత్ములూ, మహాపురుషులూ నిర్వర్తించే యజ్ఞ యాగాదులూ ఏమీ చేయలేదే? ఎంతో నిష్ఠతో, రోజూ ఉపవాసాలు వుంటూ ఆచరించే ఎటువంటి వ్రతాలూ చేయలేదే? సంవత్సరాలు తరబడి తదేక ధ్యానంతో తపస్సు చేసే మునీశ్వరులలాగా ప్రార్థించలేదే? ఇవేమీ చెయ్యకపోగా నిత్య జీవితంలో ఎన్నో తప్పులు చేస్తున్న మమ్ములను నీవు ఈ విధంగా అనుగ్రహించావంటే నీవెంతటి అమృతమూర్తివో అర్థమవుతున్నది. నీ భక్తులపై నీవు కురిపించే అపార ప్రేమ ఎంతటిదో తెలుస్తున్నది. నిన్ను మించిన వేరే దైవము ఎవరున్నారు తండ్రీ. నిన్ను నమ్మినవారికి వేరే ఏదీ అవసరం లేదు కదా! నీవే వారిచెంతనుండగా అంతకుమించి భాగ్యమేమున్నది! నీ నామముకంటే మధురమైనది, ఆనందమైనది, అద్భుత అనుభూతులను ప్రసాదించేది మరేదీ లేదు. ఎంతటి సిరిసంపదలున్నా నీ నామ స్మరణకంటే ఆనందమును కలుగజేయలేదు. ఒక్కసారి నీ నామ మాధుర్యాన్ని గ్రహించినవారికి ఇక ఏ భౌతిక సుఖాలపైన మనస్సు పోదు. నీ మధుర నామాన్ని స్మరిస్తున్నంత సేపు ఎటువంటి మానసిక బాధలు కానీ, శారీరక బాధలు కానీ తెలియవు. ఆ దివ్య నామ ప్రభావంచేత మమ్ము మేమే మరచిపోతాము. అసలు నీ నామాన్నే తలుచుకోవాలనే తలంపు కలగడం కూడా ఎంతో కష్టం. అది కూడా నీ అనుగ్రహం వలననే సాధ్యం అవుతుంది. నీ అనుగ్రహం లేకపోతే అటువైపే మనసు పోదు. నీ లీలలు, దివ్య విభూతులను తెలుసుకోవడానికి ఎన్నో జన్మలు పుణ్య ఫలం కావాలి. అంతటి పుణ్యఫలం ఉంటే తప్ప నీ లీలలలో లేశమంత కూడా తెలుసుకోలేము. మమ్ములను అనుగ్రహించిన ఓ శ్రీనివాసా! నీకివే మా

నమస్కారములు అని స్వామిని ఆ దంపతులిద్దరూ ఎన్నో విధాల స్తుతించారు.

ఆ తర్వాత కొన్ని రోజులకు రామాచారి, సుమతీ దంపతులిద్దరూ కలిసి తిరుమల యాత్ర సంకల్పించి ఒక శుభముహూర్తమున శ్రీనివాసుని దర్శనార్థమై బయలుదేరారు. కొన్ని రోజుల ప్రయాణం తరువాత అలిపిరి చేరుకున్నారు. వేంకటాద్రి దర్శన భాగ్యంచే వీరిరువురి శరీరాలు ఎంతో ఆనందంతో ఉప్పొంగాయి. ఉదయ సూర్యుని కాంతులలో ఆ కొండంతా దివ్యంగా మెరిసిపోతున్నది. సాక్షాత్తూ బంగారు మయమై కనిపిస్తున్నది. ఆ కొండ తేజస్సు అది సామాన్యపర్వతము కాదని చెప్పుతున్నది. సాక్షాత్తూ ఆదిశేషుడే వేంకటాద్రిగా రూపం సంతరించుకున్న అద్భుత పర్వతశ్రేణి ఈ తిరుమలకొండ.

వేంకటాద్రిపై ఉన్న శ్రీ వేంకటేశ్వరుడు అమృతమూర్తి. వైకుంఠంలోని కోటి సూర్య ప్రకాశవంతమైన దివ్య తేజస్సు, భువికి దిగి వచ్చి ఈ వేంకటాద్రిపై ఆనందనిలయంలో కొలువుండటంచేత ప్రతిరోజూ బ్రహ్మముహూర్తంలో బ్రహ్మాది దేవతలందరూ వచ్చి స్వామిని దర్శించుకుంటారు. ఆ స్వామిని ఒక్కసారి దర్శిస్తే చాలు, జన్మ ధన్యమవుతుంది. ఆ స్వామి భక్తవత్సలుడు. ఆశ్రిత పక్షపాతి. భక్తాధీనుడు ఈ శ్రీనివాసుడు, భక్తులంటే వల్లమాలిన ప్రేమ. ఎంత దూరం నుంచి పిలిచినా వెంటనే పలికే అమృతమూర్తి. కొండంత అండ ఈ కొండలరాయుడు. వైకుంఠాన్నయినా విడిచి ఉంటాను గానీ, నన్ను ఆశ్రయించిన భక్తులను మాత్రం క్షణం కూడా విడువనంటాడు శ్రీనివాసుడు, అంతటి కరుణామూర్తి శ్రీనివాసుడు, తిరుమలేశుడు.

గోవిందనామ స్మరణతో కొండనెక్కుతున్న భక్తులతో కలిసి రామాచారి దంపతులిద్దరూ నడవసాగారు. ఒక్కసారి మనస్సులో ఆ శ్రీమన్నారాయణులవారికి, ఆదిశేషునికి నమస్కరించి కొండనెక్కడం ప్రారంభించారు. ఆహా! ఎంత రమణీయంగా వున్నది ఈ ప్రకృతి. ఈ విశ్వంలో ఎక్కడా ఇంతటి దివ్యానుభూతులు కలుగవే అని తలుస్తూ గోవిందనామ స్మరణతో భక్తులందరూ కొండనెక్కసాగారు. అక్కడక్కడా చక్కటి సెలయేళ్ళు... చెట్లపై రకరకాల పక్షుల కూతలు... రంగు రంగుల

# శ్రీచరణామృతము

పూలమొక్కలు... రకరకాల మధుర ఫలాల చెట్లు. ఆహా! సాక్షాత్తూ ఆ వైంకుంఠ నాధుడే శ్రీనివాసునిగా కొలువున్న ఈ అద్భుతపర్వతంపై ప్రతీదీ విశేషమే కదా.

శ్రీనివాసుని దివ్య లీలలను తలుస్తూ కొండనెక్కుతున్న ఆ దంపతులకు కొంత దూరం నడవగానే మరికొంతమంది భక్తులు కలిశారు. కొంతదూరం నడిచేటప్పటికి వారితో ఒక వృద్ధ భక్తుడు కూడా కలిశాడు. వయస్సులో వృద్ధాప్యంలో వున్నట్లు కనిపిస్తున్నప్పటికి అతడు ఎంతో తేజస్సుతో మెరిసిపోతున్నాడు. కొంత దూరం నడిచిన తరువాత అందరూ ఒక రాతిబండ దగ్గర కూర్చున్నారు. అప్పుడు ఆ వృద్ధుడు మిగిలిన భక్తులతో ఇలా అన్నాడు. 'నాయనలారా! మీ అందరి ముఖాలలో ఆనందం చూస్తుంటే నాకెంతో ముచ్చట వేస్తున్నది. కొండనెక్కుతున్న అలసట ఏ మాత్రం కనిపించకుండా ఆ ఏడు కొండలవాడిపైనే మనసంతా నిమగ్నం చేసి నడుస్తున్న మీ ముఖములు ఎంతో ఆనందంగా వున్నాయి. ఈ తిరుమల కొండ ఎంతో దివ్య ప్రదేశం. ఈ సృష్టిలో ఇంతకుమించిన పవిత్ర ప్రదేశం మరొక్కటి లేదు. ఈ కొండపై కాలు పెట్టాలంటే ఎన్నో వేల జన్మల పుణ్యఫలం కావాలి. ఈ కొండను మనస్సులో తలుచుకుంటేనే జన్మ జన్మల పాపాలూ నశిస్తాయి. సర్వ దేవతా గణమూ, సర్వ మునిగణమూ, సర్వ యక్ష, కిన్నెర, కింపురుష గణములూ ఎల్లప్పుడూ ఈ కొండపైనే వుండాలని కోరుకుంటారు. అనేక రూపాలలో వీరందరూ ఈ కొండపై భక్తుల నడుమ సంచరిస్తూ ఆ భక్తులు శ్రీమన్నారాయణుని గురించి ముచ్చట్లాడే విశేషాలను విని ఆనందిస్తుంటారు. ఈ పవిత్ర కొండపై చేసే ఏ పుణ్యకార్యమైనా వెయ్యి రెట్లు ఎక్కువ ఫలితం ఇవ్వగలదు. ఈ కొండపై చేసే ఏ పాపకార్యమైనా సహస్ర జన్మలవరకూ నశించదు. ఈ కొండపై కాలు పెట్టే భాగ్యం కోసం ఎందరో దేవతలు ఎదురు చూస్తున్నారు. అంతటి దివ్య ప్రదేశం అయిన ఈ కొండపై ఎటువంటి అధర్మ కార్యక్రములు చేయరాదు' అని చెబుతుండగా ఒక్కసారిగా ఆ భక్తుల గుంపులోని రామయ్య అనే భక్తుడు బాధతో గట్టిగా మూలిగాడు. అది విని భక్తులందరూ అతని వద్దకు చేరి ఏమైందని అడిగారు. అప్పుడు రామయ్య తన కాలును చూపిస్తూ పాదాల వద్ద ఏదో విషపు పురుగు కుట్టిందని, ఎంతో నొప్పిగా

వుందని అన్నాడు. అందరూ చూస్తుండగానే కాలు బాగా వాచింది. రామయ్య బాధ కూడా ఎక్కువైంది.

భక్తులందరికీ ఏమి చేయడానికి పాలు పోవడం లేదు. అందరూ ఆ శ్రీనివాసునే ప్రార్థించసాగారు. వారిలో ఒకరు ఆ వృద్ధ భక్తునితో 'స్వామీ మీరు వయస్సులో పెద్దవారైనప్పటికీ ఎంతో దివ్య తేజస్సు కలిగి వున్నారు. సర్వ శాస్త్రాలూ తెలిసిన వారిలా వున్నారు. మాయందు దయవుంచి ఈ రామయ్య బాధ తగ్గిపోయే ఉపాయం ఏమైనా చెప్పండి అని వేడుకున్నాడు. అప్పుడా వృద్ధ భక్తుడు రామయ్య దగ్గరకు వచ్చి "గోవిందా... గోవిందా... గోవిందా..." అని మూడు సార్లు గట్టిగా నామస్మరణచేస్తూ నొప్పి వున్న ప్రదేశంలో నోటితో గాలి వూదాడు అంతే అద్భుతంగా ఒక్క క్షణంలోనే ఆ వాపు తగ్గిపోయింది. రామయ్యకు బాధ పూర్తిగా తగ్గిపోయి ఆనందం కలిగింది. రామయ్య వెంటనే ఆ వృద్ధ భక్తునికి నమస్కరించి, స్వామీ మీరెవరో మహానుభావుడిలా వున్నారు. సాక్షాత్తూ ఆ దేవదేవుడే మీరూపంలో వచ్చినట్లున్నది. లేకపోతే అంతటి బాధ ఒక్క క్షణంలో ఎలా మాయమైంది అని అన్నాడు. రామాచారితో సహా మిగిలిన భక్తులందరూ ఆ వృద్ధ భక్తునికి నమస్కరించి అనేక విధాల అతనిని ప్రశంసించారు.

అప్పుడు ఆ వృద్ధ భక్తుడు వారందరితో ఇలా అన్నాడు. నాయనలారా! ఇందులో నా గొప్పతన మేమున్నది, ఆ స్వామి నామం అంత గొప్పది. ఆ నామానికున్న శక్తి ఇంత, అంత అని చెప్పనలవి కానిది. ఎవరైతే పూర్తి నమ్మకంతో, పూర్తి భక్తితో, ఆ దివ్యనామాన్ని స్మరిస్తారో వారికి ఎటువంటి ఆపదలూ కలుగవు. సర్వ సౌభాగ్యాలూ లభిస్తాయి. ఏ సమస్యలనుంచైనా తక్షణం బయటపడవేసే సాధనం ఆ గోవింద నామస్మరణఒక్కటే. కొండలపైనుంచి జారిపోతున్నా సరే ఆ స్వామి నామం ఒక్కసారి తలిస్తే చాలు. వెంటనే ఏ చెట్టుకొమ్మనో చేతికి తగిలి రక్షింపబడతాడు. భయంకర తుఫానులో నీటిలో మునిగిపోతున్నవాడైనా ఒక్కసారి ఆ స్వామి పాదాలను తలిస్తే చాలు వెంటనే ఏదో ఒక ఆసరా దొరికి ఒడ్డుకి చేరవేయబడతాడు. ఆ పరబ్రహ్మ మూర్తి నామానికి అంత మహిమ వున్నది అని

అన్నాడు. భక్తులందరూ అతనికి నమస్కరించి తమ నడక కొనసాగించారు. రామాచారి దంపతులు మాత్రం కాసేపు అక్కడే వుండదలచారు.

భక్తులందరూ కనుచూపుమేర దాటిపోయిన తరువాత రామాచారి దంపతులకు ఒక్కసారిగా తమ కంటికి ఎదురుగా పెద్ద వెలుగు కనిపించి ఆ తేజస్సు తట్టుకొనలేక ఒక్కక్షణం కనులు మూసుకున్నారు. కనులు తెరిచేటప్పటికి ఆ వృద్ధ భక్తుడు కనబడలేదు, అతని స్థానంలో ఎంతో అద్భుత తేజస్సుతో వెలిగిపోతున్న ఒక మునీశ్వరుడు కనబడ్డాడు. వెంటనే రామాచారి దంపతులిద్దరూ ఆ మునీశ్వరునికి నమస్కరించారు. ఆ యోగీశ్వరుడు వీరితో మాట్లాడుతూ నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! నేను సప్తఋషులలో ఒకడైన వశిష్ఠుడను. ఆ శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో ఇక్కడికి వచ్చాను. కొద్దిసేపట్లోనే మీకెదురుగా ఆకాశంలో సర్వాంతర్యామి, సర్వలోకాధీశుడు, సర్వదేవతా స్వరూపుడు అయిన శ్రీమన్నారాయణులవారి దివ్య పాద దర్శనం కలుగుతుంది. కనులారా దర్శించి, తరించండి. ఆ దివ్య చరణవైభవం వర్ణించనలవి కానిది. ఎన్ని జన్మల పాపాలైనా ఆ పాద దర్శనంచే పటా పంచలౌతాయి. అసలు ఎన్నో జన్మల పుణ్యఫలం చేత గానీ, ఆ పాద దర్శనం సాధ్యం కాదు. ఎందరో మునీశ్వరులు కొన్ని కోట్ల సంవత్సరాలుగా ఈ పాదదర్శనం కోసమే తపస్సు చేస్తున్నారు. ఆ అమృతచరణదర్శనభాగ్యం కలుగగానే మనము భూత, భవిష్యత్, వర్తమానాలు మరచిపోతాము. ఏ ఆలోచనా రాదు. నోటమాట రాదు. మనస్సులో ఏ కోరికా కలుగదు. ఆ దివ్య పాద దర్శనం ప్రభావం చేత నిశ్చేష్టులమైపోతాము. ఆ పాదాలు మాయమైన తరువాత గానీ, ఆ దివ్య దర్శన భాగ్యం ఎంతటి మహత్తరమైనదో అర్థం కాదు. మీ దంపతులిద్దరూ ఎంతో పుణ్యాత్ములు. ఎన్నో జన్మల నుంచి స్వామిని సేవిస్తున్నారు. అందువలననే మీకీ దర్శన భాగ్యం కలుగుతున్నది అని చెప్పుతుండగా ఒక్కసారి ఆకాశంలో అద్భుతమైన కాంతి పుంజం కనిపించింది. ఆ కాంతి పుంజంనుంచి శ్రీమన్నారాయణులవారి దివ్యపాదాలు దర్శనమిచ్చాయి.

అంతే! ఆ అద్భుత దృశ్యం చూసిన రామాచారి దంపతులకు నోట మాట

రాలేదు. రామాచారి ఆ శ్రీమన్నారాయణుని స్తుతిస్తూ ఇలా అన్నాడు. ఓ శ్రీమన్నారాయణా! మా భాగ్యం ఏమని చెప్పను. ఎంతటి అదృష్టాన్ని ప్రసాదించావు తండ్రీ! ఓ భక్తవత్సలా నీకివే మా నమస్కారములు. ఓ జగన్నాథా! నీకివే మా ప్రణామములు. ఓ పురుషోత్తమా నీకివే మా నమస్కారములు. మేము ఎన్నో పాపాలు చేసినప్పటికీ మమ్ములను అనుగ్రహించి ఇంతటి దివ్యదర్శనం ప్రసాదించావు. అల్పులమైన మేము నిత్యం ఎన్నో పాపాలు చేస్తున్నాము. ఇది పాపం అని తెలిసి కూడా ఎన్నో పాపపు పనులు చేస్తున్నాము. సంసార సాగరంలో కొట్టుకుపోతూ మోహావేశాలకు లోనై నిన్ను తలవటమే మరచిపోయాము. అయినా నీవెంతో దయామయుడవై మాకు నీ దివ్య పాద దర్శనం ప్రసాదించావు. ఇంతటి అమృత దర్శనభాగ్యంతో మేము పునీతులమైనాము. ఇకముందు ఎటువంటి పాపకర్మలూ చేయకుండా వుండేలా మనోనిగ్రహం ప్రసాదించు తండ్రీ అని స్వామిని ఎన్నో విధాల వేడుకున్నాడు. కొద్దిసేపటికల్లా ఆ దివ్య పాదాలు అంతర్ధానమైనాయి. వశిష్ఠులవారు కూడా అదృశ్యమైనారు. రామాచారి దంపతులిద్దరూ శ్రీనివాసునికి మనస్సులో మరొక్కమారు నమస్కరించి ముందుకు సాగారు.

తిరుమల గిరులు ఎంతో అద్భుత ప్రకృతి సౌందర్యంతో విరాజిల్లుతున్నాయి. చుట్టూ చక్కని చెట్లు, అందమైన పూలమొక్కలు, చెట్లపై రకరకాల పక్షుల కిల కిలా రావాలు... ప్రకృతి అందానికి ఆనందపడుతూ ముందుకు నడుస్తున్న రామాచారి దంపతులకు మరికొంతమంది భక్తులు కలిశారు. అందరూ కలిసి శ్రీనివాసుని లీలలను తలుచుకుంటూ, గోవింద నామ స్మరణచేస్తూ కొండనెక్కసాగారు. ఇంతలో ఒక విచిత్రం జరిగింది. ఈ భక్తులకు కొంచెం ముందుగా కాలిబాటలో ఒక పాము, ముంగిస ఆడుకుంటూ కనిపించాయి. ఆ దృశ్యం చూసిన భక్తులందరూ ఆశ్చర్యపోతూ వున్నచోటనే నిలబడిపోయారు. బద్ధ శత్రువులైన పాము, ముంగిసలు ఇలా తమ జాతి వైరం మరచి ఆడుకొనటం వారికి అర్థం కాలేదు. వారెంతో ఆశ్చర్యానికి లోనైనారు. ముందుకు నడిస్తే వాటి ఆటకు భంగం కలుగుతుందేమోనని అక్కడే ఆగిపోయి, దూరంనుంచే ఆ అద్భుత దృశ్యం తిలకిస్తున్నారు. ఇంతలో వాటి

ఆటకు మరో ముంగిస కూడా వచ్చి చేరింది. ఆ మూడూ కలిసి ఇంకా ఉత్సాహంతో ఆడుకుంటున్నాయి. అది చూసిన భక్తులెవ్వరికీ నోట మాట రావటం లేదు. అందరూ నివ్వెరపోయి చూస్తున్నారు. కాసేపు ఇక్కడే విశ్రమిద్దామని తలచి అందరూ ఆ పక్కనే వున్న రాళ్ళపై కూర్చుని దూరం నుంచే ఆ దృశ్యాన్ని చూడసాగారు.

భక్తులందరూ ఆ అద్భుత దృశ్యాన్ని చూస్తూ తన్మయత్వంలో వుండగా ఒక సాధువు అడవిలోనుంచి నడుచుకుంటూ వచ్చి వీరి ప్రక్కనే కూర్చున్నాడు. భక్తులందరూ ముంగిసలు, పాము కలిసి ఆడుకుంటున్న దృశ్యం చూసి ఆశ్చర్యపడుతుండటం గమనించాడు. చిరునవ్వుతో వారిని ఉద్దేశించి ఇలా అన్నాడు. నాయనలారా! ఈ అద్భుత దృశ్యం చూసి ఆశ్చర్యపోతున్నారు కదా! ఈ తిరుమల అంతటి దివ్య ప్రదేశం, ఈ కొండపై వున్న జంతువులన్నీ తమ తమ జాతి వైరాలను మరిచి ఎంతో సఖ్యంగా జీవిస్తాయి. అసలు వీరందరూ ఎవరనుకున్నారు? క్రిందటి జన్మలో శ్రీనివాసుని ప్రియ భక్తులే! అయితే వారి వారి పూర్వజన్మ పుణ్య ఫలాలలను అనుసరించి మరు జన్మలో ఈ రూపాలు కలిగాయి. పాప కర్మలు చేయటం వలన ఈ విధంగా పక్షులుగానూ, జంతువులుగానూ, సర్పాలుగానూ, జన్మించినప్పటికీ చేసుకున్న పుణ్యఫలం వలన ఇంతటి పవిత్రకొండపై జన్మించారు. లేకపోతే అన్ని జంతువుల వలెనే ఈ భూమండలంలో వేరేచోట ఎక్కడో జన్మించి దుర్భర జీవితాన్ని అనుభవించేవారు. మీకు కనిపిస్తున్న ఆ రెండు ముంగిసలు పూర్వజన్మలో రామయ్య, కృష్ణయ్య అనే అన్నదమ్ములు. వారు అనేక వ్యాపారాలు చేస్తూ వీలున్నంతలో దాన ధర్మాలు చేస్తూ కాలం గడిపేవారు. వారి వ్యాపారాలలో నూనె వ్యాపారం ముఖ్యంగా వుండేది. కల్తీ లేకుండా వ్యాపారం చేస్తారనే మంచి పేరు సంపాదించుకున్నారు. తమ వద్ద పనిచేసే వారందరినీ ఎంతో చక్కగా చూసేవారు. ప్రతీ సంవత్సరం వారందరినీ తీసుకుని వెళ్ళి తిరుమల యాత్ర చేసేవారు.

రోజులు ఇలా గడుస్తుండగా కొంతకాలానికి ఆ వూరికి ఎక్కడినుంచో సుబ్బయ్య అనే నూనె వ్యాపారి వచ్చాడు. చిన్నగా వ్యాపారం ప్రారంభించి కొద్ది కాలంలోనే

బాగాఅ భివృద్ధిచే శాడు. సుబ్బయ్యవ్యాపారంఎ ంతోఅ భివృద్ధిచెందడంచూసిన రామయ్య, కృష్ణయ్య సోదరులకు అతడిపై ఈర్ష్య ప్రారంభమైంది. అతడి పోటీని తట్టుకొనటం కోసం తక్కువ ఖరీదుగల వేరే నూనెలను కలిపి కల్తీ వ్యాపారం చేయడం ప్రారంభించారు. అందువలన నూనెను తక్కువ ధరకే అమ్మేవారు. ఇది కొన్నాళ్ళకు సుబ్బయ్యకు తెలిసింది. వెల తక్కువగా వుండటంచేత ప్రజలందరూ ఆ అన్నదమ్ముల వద్దనే కొనటం చూసి తాను మాత్రం వారికి తీసిపోయాడా అని తలచాడు. ఇలా తలచినదే తడవుగా తాను కూడా నూనెను కల్తీ చేసి తక్కువ ధరకే అమ్మటం మొదలు పెట్టాడు. ఈ విధంగా అటు ఆ రామయ్య, కృష్ణయ్య సోదరులు, ఇటు ఈ సుబ్బయ్య ప్రజలను మోసం చేయసాగారు. చివరికి కొంత కాలానికి వీరిద్దరి కుటుంబాల మధ్య కూడా బద్ధ వైరం ఏర్పడింది. ఆవేశాలకు లోనై వారందరూ ఆ శ్రీనివాసుని సంగతే మర్చిపోయారు. ప్రతీ సంవత్సరం వారి దగ్గర పనిచేసే వారందరినీ తీసుకువెళితే ఖర్చు ఎక్కువవుతుందని తలచి మానివేశారు. కొంతకాలానికి వారు కూడా తిరుమల వెళ్ళడం మానివేశారు. బ్రతికినంత కాలం అలా అన్యాయంగా వ్యాపారం చేస్తూ, ఈర్ష్యాద్వేషాలతో జీవించటం వలన వీరందరూ మరు జన్మలో మానవ జన్మ పొందక ఈ విధంగా జంతు జన్మలు పొందారు. అయితే జీవితంలో కొంతకాలం శ్రీనివాసుని సేవించినందువలన ఈ పవిత్ర స్థలంలో జన్మించగలిగారు. ఆ బద్ధ వైరం వాసనలు పూర్తిగా తొలగిపోనందున ఈ జన్మలో కూడా ఆ వైరమే కొనసాగిస్తూ రామయ్య, కృష్ణయ్యలు ముంగిసలుగానూ, సుబ్బయ్య సర్పంగానూ జన్మనెత్తారు. అయితే ఈ వేంకటాద్రి దివ్య ప్రదేశం కావడం చేత వారు తమ పూర్వ జన్మల వాసనలు మరిచిపోయి కలిసి మెలిసి వుంటున్నారు' అని ఆ సాధువు భక్తులందరికీ చెప్పాడు.

అప్పుడు ఆ భక్తులు సాధువుతో ఇలా అన్నారు. 'స్వామీ! మీరెవరో దివ్య పురుషులవలె వున్నారు. మాకు ఒక్క సందేహం, ఆ వ్యాపారులు ఎన్ని పాపాలు చేసినా, ఏ పుణ్యం చేయడం వలన ఇక్కడ ఈ పవిత్ర కొండపై జన్మించగలిగారు? కనీసం జీవితంలో ఒక్కసారి కాలు పెట్టడానికే ఎన్నో జన్మల పుణ్యఫలం కావాలంటారు

కదా. అటువంటప్పుడు ఇక్కడే జన్మింపగలిగిన వారు ఎంతటి పుణ్యకార్యాలు చేసి వుంటారో కదా! దయచేసి తాము మాకు వివరంగా తెలియపరచవలసింది అని అర్థించారు. అప్పుడు ఆ సాధువు భక్తులకు ఇలా చెప్పసాగాడు. 'నాయనలారా! మీ సందేహం నాకర్థమైంది, వివరంగా చెప్తాను వినండి. సర్వ ప్రాణికోటికి వారి వారి కర్మ ఫలానుసారం మరు జన్మ అనుగ్రహించేది ఆ శ్రీమన్నారాయణుడే. ఎవరైతే పుణ్యకార్యాలను చేస్తూ సత్ప్రవర్తన కలిగి వుంటారో వారికి ఉత్తమ జన్మలను అనుగ్రహించే కరుణామూర్తి శ్రీనివాసుడు. మానవులు, మోహావేశ పూరితులై ప్రతీదీ శాశ్వతం అని తలుస్తారు. భార్య, పిల్లలు, బంధువులు, ఇళ్ళు, పొలాలు, వస్తువులు, వాహనాలు ఇలా అనేక బంధాలలో పడి కొట్టుకుపోతుంటారు. కానీ చివరన ఇవేమీ తమతో రావని తలచరు. అనుభవిస్తున్నంత కాలం అవన్నీ శాశ్వతమైనవిగా వారికి తోస్తాయి. కానీ,ఆ జీ వితంఎ ంతఅ ల్పమైనదో,ఎ ంతక్షణికమైనదో గ్రహించరు. కొన్ని లక్షల సంవత్సరాలుగా గడుస్తున్న ఈ కాల భ్రమణంలో కేవలం నూరు సంవత్సరాలు జీవించే మానవుడి జీవితకాలం ఎంత? అంతదాకా ఎందుకు, ఒక విషయం అడుగుతాను చెప్పండి, మీరందరూ మీపేరు, మీ తండ్రిపేరు, మీ తాత పేరు చెప్పగలుగుతారు. బహుశా మీలో కొందరు మీ ముత్తాత పేరు కూడా చెప్పగలుగుతారు. అయితే ఆ ముత్తాతకు తండ్రి, తాత, ముత్తాతల పేర్లు చెప్పగలరా? దాదాపు అసాధ్యం. అసలు వాళ్లు ఎలా జీవించి వుంటారు? ఏ వృత్తి చేసి వుంటారు? వారి జీవితం ఎలా గడిచింది? వారి మనస్సులు ఎటువంటివి? వారి స్నేహితులెవ్వరు? వారు ఎన్ని రోజులు జీవించారు? ఇవేమైనా చెప్పగలరా? వారు కూడా మనలాంటివారేకదా! మనలాగే జీవించి వుంటారు కదా! జీవితం అనుభవిస్తున్నంతసేపు వారు కూడా అదే శాశ్వతం అని తలచి వుంటారే, కానీ మరి ఈరోజు అవేమీ నిలవలేదు కదా. వారు ఎంతో తాపత్రయపడినా భార్య, పిల్లలు, బంధువులు, స్నేహితులు, అందరూ కాలగర్భంలో కలిసిపోయారు. పాపం ఆ భార్యా పిల్లలకోసం వారెంత తాపత్రయ పడివుంటారో కదా! వారి సుఖం కోసం, వారి కుటుంబం కోసం, ఎన్నో అవస్థలు పడి వుంటారు కదా! కుమారుడికి ఏదో కొత్త

వస్తువు కొని పెట్టాలనో, భార్యకి ఇంకా నగలు కొని పెట్టాలనో ఇలా వీటన్నింటికోసం ధనం సంపాదించటం కోసం నానా కష్టాలూ పడి వుంటారు. కానీ అవేమీ శాశ్వతం కాదు కదా, ఈ రోజు మనకంటికి కనబడినదంతా రేపు మనకు కనపడకపోవచ్చు అని అన్నాడు.

ఆ సాధువు ఇంకా ఇలా చెప్పసాగాడు. 'ఆ రోజుల్లో మీ ముత్తాతలు ఏ బట్టలు కట్టుకున్నారో, ఎలా జీవించారో, ఈ రోజు మీకు తెలియదు. కేవలం రెండు వందల సంవత్సరాల క్రితం జన్మించిన మీ వారి గురించే మీకు తెలియనప్పుడు ఇక లక్షలాది సంవత్సరాల వెనుక వున్న మీ పై తరాల వారి సంగతేమిటి. రేపు మీ పరిస్థితి కూడా ఇంతే కదా. ఒక నూరు సంవత్సరాల తరువాత మీరెవరో, నిత్యం ఎలా జీవించేవారో, ఏ విషయాలకి ఎంత తాపత్రయ పడ్డారో, ఇవేమీ అప్పటివారికి తెలియవు. కాబట్టి ఈ సృష్టిలో ఏదీ శాశ్వతమైనది కాదు. శాశ్వతమైనదీ, భూత భవిష్యత్ వర్తమాన కాలాలు లేనిది ఆ శ్రీమన్నారాయణుడొక్కడే. ఆ స్వామిని ఆశ్రయిస్తే ఎటువంటి బాధలూ ఉండవు. మరో విశేషమేమంటే ఆ స్వామి అల్ప సంతోషి. ఆ స్వామి అనుగ్రహం పొందడానికి ఏ యజ్ఞాలూ, యాగాలూ అవసరం లేదు. ఎంతో ప్రేమతో, ఆర్తితో ఒక్కసారి గోవిందా అని పిలిస్తే చాలు, ఆ మాత్రానికే తృప్తి పడి మిమ్ముల్ని అక్కున చేర్చుకుని సర్వ సౌభాగ్యాలూ మీకనుగ్రహిస్తాడు. అంతటి అమృతమూర్తి ఆ శ్రీమన్నారాయణుడు. అని చెప్పాడు ఆ సాధువు.

ఆ సాధువు భక్తులతో ఇంకా మాట్లాడుతూ ఇలా అన్నాడు. నాయనలారా! ఇక మీరు అడిగిన విషయం చెప్తాను వినండి, రామయ్య, కృష్ణయ్య అన్నదమ్ములిద్దరూ ఎన్నో పాపాలు చేసినప్పటికీ, ఏ పుణ్యం చేసినందువలన ఈ కొండపై జన్మించే భాగ్యానికి ఎలా నోచుకొన్నారని కదా మీ సందేహం. సరే వినండి, ఆ అన్నదమ్ములిద్దరూ కలిసి జీవించేవారు, వారిద్దరిదీ ఉమ్మడి కుటుంబం. మొదట్లో శ్రీనివాసుని భక్తులైనా, అటు తర్వాత కాలంలో అక్రమ సంపాదనలో పడి ఆ స్వామిని పూర్తిగా మరిచిపోయారని చెప్పాను కదా. రోజూ పూజా పునస్కారాలు కూడా మానివేశారు. ఆ స్వామిని రోజులో ఒక్కసారి కూడా తలుచుకునేవారు కాదు,

# శ్రీచరణామృతము

మునుపటి రోజుల్లో రోజూ బయటకు వెళ్ళేటప్పుడు స్వామివారి చిత్రపటానికి నమస్కారం పెట్టే అలవాటు వుండేది. చివరకు అది కూడా మానుకున్నారు. వారింట్లో సింహద్వారంపై శ్రీనివాసుని చిత్రపటం వున్నది. ఆ పటానికి నమస్కారం పెట్టే అలవాటు మానివేసినప్పటికి రోజూ బయటికి వెళుతున్నప్పుడు, తల ఎత్తకపోయినప్పటికి వారి దృష్టికి ఆ చిత్రపటంలో స్వామి పాదాలు మాత్రం కనపడేవి. ప్రత్యేకంగా తలెత్తి స్వామి పటాన్ని చూడటం మానివేసినా రోజూ పాదాలు మాత్రం వారిదృష్టిలో పడేవి. ఆ విధంగా ఆ అన్నదమ్ములిద్దరూ వారి సంకల్పం లేకపోయినా నిత్యం శ్రీ స్వామివారి పాదాలను దర్శించినవారయ్యారు. ఆ దివ్య పాద దర్శనంచేత వారికి ఈ పవిత్ర కొండపై జన్మించే భాగ్యం కలిగింది. శ్రీమన్నారాయణులవారి పాదాల మహిమ అంతటిది. ఎవ్వరైతే మనస్సులో రోజులో ఒక్కసారైనా ఆ దివ్య పాదాలను దర్శిస్తారో వారికి సర్వ సౌభాగ్యాలూ చేకూరుతాయి. ఎటువంటి ఆపదలూ కలుగవు. ఎన్ని జన్మల పాపాలైనా ఆ దివ్య చరణదర్శనంచేత క్షణంలో నశిస్తాయి. మనం ఎంతటి ఆపదలో వున్నా సరే. ఆ దివ్య పాదాలను ఒక్కసారి మనస్సులో తలచుకుంటే చాలు. క్షణంలో ఆ ఆపద నుంచి రక్షింపబడతాము. ఇదే పెద్ద రహస్యం, మానవులు ఎంతో వ్యయ ప్రయాసలు కోర్చి యజ్ఞాలూ, యాగాలూ చేయనక్కరలేదు. ఎంతో కష్టపడి తీర్థయాత్రలు చేయనవసరం లేదు. కఠోర సంస్క ృత పదాలతో నిండి వున్న శ్లోకాలను, స్తోత్రాలను పఠించలేకపోతున్నామే అని బాధ పడనవసరం లేదు. కేవలం ఒక్కసారి ఆ దివ్య పాదాలను మనస్సులో స్మరిస్తే చాలు. సర్వసౌభాగ్యాలూ కలుగుతాయి. సర్వ దేవతా గణమూ, ఆ పాదాలనే నిత్యం అర్చిస్తున్నది. సర్వ మునిగణమూ ఆ పాద దర్శనభాగ్యం కోసమే వేల సంవత్సరాలు తపస్సు చేస్తున్నారు. ఇంతటి దివ్య పాదాలను, అసంకల్పితంగానైనా రోజూ వీక్షించినందువలననే రామయ్య, కృష్ణయ్యలకు ఈ పవిత్ర తిరుమలకొండపై జన్మించే భాగ్యం కలిగింది అని చెప్పాడు ఆ సాధువు.

భక్తులందరూ ఆ సాధువు చెప్పినదంతా ఎంతో శ్రద్ధగా విన్నారు. ఇంతలో ఆ ముంగిసలు, పాము ఆ అడవిలోకి ఎటో వెళ్ళిపోయాయి. సాధువు భక్తులందరినీ

ఆశీర్వదించి తన ఆశ్రయానికి వెళ్ళిపోయాడు. రామాచారి దంపతులతో సహా భక్తులందరూ ముందుకు నడవసాగారు. శ్రీమన్నారాయాణులవారినే మనస్సులో తలుస్తూ నడుస్తున్న రామాచారి మనస్సులో తటాలున ఒక విషయం స్ఫురించింది. ఇంతకు ముందు వచ్చిన ఆ సాధువు మరెవరో కాదు, సప్తఋషులలో ఒకరైన భృగు మహర్షియే! ఆహా! ఎంతటి భాగ్యం, సాక్షాత్తూ భృగుమహర్షులవారే శ్రీమన్నారాయణులవారి దివ్య లీలా విశేషాలను తమకు వివరించటం మా పూర్వజన్మ పుణ్యఫలం తప్ప మరేముంటుంది. అని తలచాడు. ఈ పవిత్ర తిరుమలకొండపై అంతటి మహా పురుషుని దర్శనం కలగటంచేత తమ జన్మ ధన్యమైనదని ఆ దంపతులిద్దరూ తలచారు.

ఆ మహర్షులవారు చెప్పినదాంట్లో ఎంతో సత్యమున్నదని రామాచారి గ్రహించాడు. అవును కదా! అల్పమానవులైన మనము చూసేదంతా శాశ్వతమని భ్రమిస్తాము. సిరిసంపదలన్నీ శాశ్వతమనీ, ఎంతో సుఖాన్నిస్తాయని భ్రమిస్తాము. జిహ్వా చాపల్యంతో రకరకాల ఆహారాలు తీసుకుంటాం, కానీ నిజానికి అవన్నీ అనేక వ్యాధులకు కారణమౌతాయని, తద్వారా దుఃఖానికి హేతువులని గ్రహించము. ఆత్మను ఆనందపరచే ఆధ్యాత్మిక విషయాలజోలికి పోకుండా శరీరానికి సంతోషాన్నిచ్చే పనులనే చేస్తాము. శరీరానికి సంతోషమిచ్చే ప్రతిదీ, తరువాతి కాలంలో దుఃఖానికి హేతువు అవుతుందని ఏ మాత్రం గ్రహించము. యవ్వన, మధ్య వయస్సులలో భగవంతుని గురించి ఇప్పుడే ఎందుకు తొందర, వార్ధక్యంలో ఆలోచింపవచ్చునని తలుస్తారు. అప్పుడు శరీరం సహకరించదు, మనస్సు ఎప్పుడూ శరీర బాధల గురించే ఆలోచిస్తుంది తప్ప భగవంతుడివైపు మరలదు. అంతేకాక మరణభయం ఎల్లప్పుడూ మనిషిని తినేస్తుంటుంది. భార్య, పిల్లల్ని, బంధుమిత్రుల్ని వదిలి వెళ్ళవలసి వస్తుందనే బెంగ పట్టుకుంటుంది. ఈ ఆలోచనలన్నింటిలో పడి కొట్టుకుంటూ భగవంతుని గురించి ఏ మాత్రం ఆలోచించడు. రామాచారి ఈవిధంగా ఆలోచిస్తూ, కొండనెక్కసాగాడు.

శ్రీమన్నారాయణులవారి లీలలను తలుస్తూ భక్తులందరూ రెండవ కొండ

పూర్తిచేసి మూడవ కొండపై కాలు పెట్టారు. కొంతదూరం ఎక్కిన తరువాత కాసేపు విశ్రమిద్దామని తలచి ఒక చోట ఒక పెద్ద వృక్షం కనపడటంతో అక్కడ కూర్చున్నారు. అక్కడకు దగ్గరలోనే ఒక చక్కని సరోవరం వుండటం గమనించారు. ఆ సరోవరం చెంతకు వెళ్ళి నీళ్ళు తీసుకుని త్రాగారు. ఆ నీరు తగలగానే శరీరమంతా జివ్వుమంది. ఏదో తెలీని దివ్య శక్తి శరీరమంతా నిండినట్టు అనిపించింది. ఆహా! ఈ కొలను సామాన్యమైనదిగా లేదు. ఇదేదో దివ్యతీర్థంలా వున్నదని భక్తులు అందరూ తలచారు. బహుశా! ఏదో దేవలోకం నుండి తిరుమలకు వచ్చిన దివ్య తీర్థం అని వారికి తోచింది.

భక్తులందరూ ఈ విధంగా ఆలోచిస్తుండగా అడవిలోనుంచి ఒక మహర్షి అటుగా వచ్చాడు. అక్కడ కొలనువద్ద నిల్చున్న భక్తుల వద్దకు రాగానే వారందరూ అతడికి నమస్కరించి ఈ కొలను విశేషమేమిటని అడిగారు. అప్పుడు ఆ యోగీశ్వరుడు చిరునవ్వుతో ఇలా చెప్పసాగాడు. నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! ఈ కొలను సామాన్యమైనదికాదు, సాక్షాత్తూ శ్రీనివాసుని అనుగ్రహంతో వెలసిన దివ్య తీర్థం. దీనిపేరు శ్రీపాద తీర్థం. ఈ కొలనులోని నీరు సేవిస్తే వేల జన్మల పాపాలు నశిస్తాయి. ఎటువంటి అనారోగ్యమైనా క్షణంలో తొలగిపోతుంది. శరీరమంతా నూతన తేజస్సుతో నిండిపోతుంది. ఈ కొలను మహిమ గురించి చెప్తాను వినండి అని అన్నాడు.

ఆ పవిత్ర కొలను వృత్తాంతం ఈ విధంగా చెప్పసాగాడు. 'పూర్వకాలంలో ధర్మపాదుడు అనే మహర్షి శ్రీమన్నారాయణులవారిని ప్రసన్నం చేసుకొనడానికై ఘోర తపస్సును ఆచరించాడు. ఆ మహర్షి కనులు మూసుకుని ఎల్లవేళలా ఆ పరబ్రహ్మమూర్తి పాదాలనే మనస్సులో ధ్యానం చేస్తూ ఎన్నో సంవత్సరాలు గడిపాడు. అప్పుడుఒ కనాడుశ్రీ మన్నారాయణులవారుచ తుర్భుజుడైశ ంఖచక్రాలతోది వ్యంగా ప్రకాశిస్తూ దర్శనమిచ్చాడు. ఆ స్వామి తనను అనుగ్రహించి, ప్రత్యక్షమైనందుకు ఎంతో సంతోషపడినవాడై ధర్మపాదుడు శ్రీమన్నారాయణులవారితో ఇలా అన్నాడు. ఓ శ్రీమన్నారాయణా! పరంధామా! పరమపురుషా! నీకివే నా నమస్కారములు.

నన్ను అనుగ్రహించి, నీ దివ్య దర్శన భాగ్యం కలుగజేసినందుకు నీకు నా ప్రణామములు. నీవు పురుషోత్తముడవు, భక్తులపాలిటి కల్పవృక్షం నీవే. నిన్ను నమ్మి కొలచినవారికి సర్వ సౌభాగ్యాలూ అనుగ్రహించే అమృతమూర్తివి నీవే! నీ నామ సంకీర్తనవలననే నారదుడు, తుంబురుడు, అష్ట దిక్పాలకులూ, నవగ్రహ దేవతలూ, సర్వయక్ష గణములూ, వారి వారి శక్తులు పొందగలుగుతున్నారు. నీవు యజ్ఞ స్వరూపుడవు, విశ్వ రూపుడవు, మంగళ ప్రదుడవు, దివ్య మంగళ రూపుడవు, సమస్త జీవకోటిచే ఆరాధింపదగినవాడివి నీవే! ఏ దేవతలను పూజించినా చివరకు అది నీకే చెందుతుంది, వేదములు, ఉపనిషత్తులు, పురాణములు అన్నీ కూడా నీ స్వరూపమే! నీ నామస్మరణకు మించిన ఆనందమైనది మరొకటి లేదు. నీ పాదసేవకు మించిన భాగ్యం మరొకటి లేదు. నీ దివ్య పాద పద్మముల మహిమ ఇంతా, అంతా అని వర్ణించలేము. కేవలం ఒక్కసారి మనస్సులో నీ దివ్య పాదములను స్మరించినా, సర్వ పాపములు నశిస్తాయి. సర్వవేళలా నీకు శయ్యగా, ఛత్రంగా, మిత్రునిగా, భక్తునిగా వుంటూ ఎల్లవేళలా తన సహస్ర కనులతో నీ పాదాలను దర్శిస్తున్న ఆ ఆదిశేషుడు ఎంతటి అదృష్టవంతుడో కదా. అతని ఆనందము వర్ణింపశక్యము కానిది. కేవలము రెండు కనులతో దర్శిస్తున్న నాకే ఇంత ఆనందముగా వుంటే ఇంక వేల కన్నులు కలిగిన ఆతని ఆనందం ఎంతని చెప్పగలను. బహుశా! ఆ ఆదిశేషుడు తన సహస్రనాలుకలతో కూడా ఆ ఆనందమును వర్ణింపలేడేమో. చతుర్ముఖ బ్రహ్మ తన నాలుగు ముఖాలతో, ఎనిమిది కన్నులతో నీ పాదములను వీక్షిస్తూ ఎంతో ఆనందమును పొందుతున్నాడు. ఇక సర్వవేళలా శ్రీ, భూ, నీలాంశలతో నీవెంటనే వుంటూ నీ పాదాలను సేవిస్తున్న జగన్మాత, శ్రీ మహాలక్ష్మి తల్లి ఆనందమెంతని చెప్పగలను? ఓ జగన్నాథా! జగద్రక్షకా! నాకు ఇంతటి దివ్య భాగ్యాన్ని ప్రసాదించిన నా అదృష్టం ఎంతని చెప్పుదును. కానీ ఒక్క విషయమే నాకు వెలితిగా వున్నది. నీ పాదాలను పూజించి, ఆ తీర్థమును స్వీకరించడానికి ఇక్కడ ఎక్కడా చిన్న జలధారయైనా కనిపించుటలేదే అని బాధగా వుందని అని అన్నాడు.

అప్పుడు భక్త సులభుడు, భక్త పక్షపాతి అయిన శ్రీమన్నారాయణులవారు

# శ్రీచరణామృతము

ధర్మపాదునితో ఇలా అన్నాడు. నాయనా! ధర్మపాదా! నీవు చింతింపవలదు. నీ కోరిక నాకెంతో సంతోషం కలిగించినది. నన్ను సేవించుకొనడానికి నీకొరకై ఇక్కడే ఒక తీర్థాన్ని సృష్టిస్తున్నాను. ఇందలి జలంతో నన్ను సేవింపవలసినది. ముందు కాలంలో ఈ తీర్థం శ్రీపాద తీర్థం అనే పేరుతో ప్రసిద్ధి నొందగలదు. ఈ తీర్థంలోని నీరు సేవించినవారికి సర్వరోగాలు నశిస్తాయి. కోటి జన్మల పాపం పటాపంచ లవుతుంది. సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి అని సెలవిచ్చాడు. అప్పుడు ధర్మపాదుడు స్వామివారి భక్త వాత్సల్యతకు ఎంతో సంతోషపడి ఆ తీర్థంలోని జలంతో శ్రీమన్నారాయణులవారి దివ్య చరణాలను పూజించి, ఆ తీర్థాన్ని స్వీకరించాడు. ఆ రోజు నుంచి ఈ తీర్థం శ్రీపాద తీర్థం అనే పేరుతో వ్యవహరింపబడుతోంది'. అని ఆ యోగీశ్వరుడు రామాచారితో సహా వున్న భక్తులందరికీ వివరించాడు.

ఇదంతా విన్న భక్తులందరికీ ఎంతో ఆనందం కలిగింది. ఆ స్వామి పాద మహిమ ఇంతటిది అని గ్రహించారు. ఇంతటి అద్భుత తీర్థం తమకు కనపడేలా అనుగ్రహించినందుకు ఆ శ్రీనివాసుని అనేక విధాల ప్రార్థించారు. భక్తులందరూ ఆ యోగీశ్వరునితో 'స్వామీ! శ్రీమన్నారాయణులవారి దివ్య పాద మహిమలను ఇంకా వినాలని వున్నది. మమ్ములను అనుగ్రహించి చెప్పవలసింది. అని వేడుకున్నారు. అపుడా యోగీశ్వరుడు శ్రీమన్నారాయణులవారి దివ్య పాద వైభవాన్ని ఈవిధంగా చెప్పసాగాడు. నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! జగత్ప్రభువైనటువంటి ఆ శ్రీమన్నారాయణులవారి దివ్య పాద మహిమను ఎంతని వర్ణించను? సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు సైతం ఈ సృష్టి ప్రారంభించడానికి ముందు ఈ దివ్య పాదాలనే అర్చించాడు. లయకారకుడైన పరమేశ్వరుడు ప్రళయకాలంనందు ఈ దివ్య చరణాలనే సేవించాడు. బ్రహ్మర్షి నారద మునీంద్రుడు ప్రతిరోజు లోకసంచారానికై బయలుదేరేముందు నారాయణనామజపం చేస్తూ ఈ పాదాలనే మనస్సులో ప్రార్థిస్తాడు. అ ష్టదిక్పాలకులైనఇ ంద్రుడు,వ రణుడు,యమముడు,వాయువు,అ గ్ని, కుబేరుడు, ఈశానుడు, నిరుతి ప్రతిరోజూ తమ తమ విధులను నిర్వర్తించేముందు శ్రీమన్నారాయణులవారి దివ్య పాదాలనే సేవిస్తారు. నవగ్రహ దేవతలైన సూర్యుడు,

# శ్రీచరణామృతము

చంద్రుడు, కుజుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, రాహువు, కేతువులు నిత్యం ఈ దివ్య పాదాలనే అర్చిస్తున్నారు. అందుచేతనే ఈ దివ్య పాదములను ప్రతిరోజూ లేచిన వెంటనే మనస్సులో ప్రార్థించినవారికి ఎటువంటి గ్రహ బాధలూ వుండవు. సర్వదా ఈ దివ్య చరణాలనే మనస్సులో నిలుపుకునేవారికి అపమృత్యు భయం ఉండదు. మానవుల శరీరాలను అనేక రకాల సూక్ష్మక్రిములు అంటిపెట్టుకుని ఉంటాయి. ఎవరైతే శ్రీమన్నారాయణులవారి దివ్య పాదాలను మనస్సులో నిలుపుకుంటారో, ఆ పాదాల దివ్య తేజస్సు ప్రభావంచేత ఆ క్రిములన్నీ ఎంతో దూరం నెట్టివేయబడతాయి. ప్రతీరోజూ శ్రీ స్వామివారి దివ్య పాదాలను స్మరించేవారికి ఈ భూమండలంలోని ముక్కోటి తీర్థాలలో స్నానమాచరించిన ఫలం దక్కుతుంది. ఎన్నో జన్మలలో చేసిన పాపఫలం నశిస్తుంది.

మానవులందరూ వారి వారి పూర్వ జన్మ పాపపుణ్య ఫలాలతో తిరిగి జన్మలెత్తి పాపకర్మలు, పుణ్యకార్యాలూ చేస్తుంటారు. క్రిందటి జన్మలలో చేసిన పాపపుణ్యాల ఫలంగా సుఖదుఃఖాలను అనుభవిస్తారు. మానవులలో చాలామంది కిందటి జన్మలో చేసిన పాప, పుణ్యఫలం వెంటనే ఈ జన్మలో అనుభవానికి వస్తుందని భావిస్తారు. కానీ అది సరికాదు. కిందటి జన్మలో చేసిన పుణ్యఫలం పది జన్మల తరువాత అనుభవానికి రావచ్చు. ఎప్పుడో నూరు జన్మల వెనుక చేసిన పుణ్యఫలం ఈ జన్మలో అనుభవానికి రావచ్చు. అందుకనే ఎంతో పుణ్యాత్ములు కష్టాలు అనుభవించవలసి రావటం, ఎంతో పాపాత్ములు అనేక సుఖాలు అనుభవిస్తుండటం చూస్తుంటాము. ఎవరైతే ఆ శ్రీమన్నారాయణుని దివ్య పాదాలను ఆశ్రయిస్తారో వారు మునుపటి జన్మలలో చేసిన పాపాలన్నీ నశించి, సర్వ సౌభాగ్యాలను అనుభవిస్తారు. అంతేకాదు, ఎవ్వరైతే ఆ దివ్య చరణాలను మనస్సులో నిత్యం స్మరిస్తూ వుంటారో వారికి, ఎటువంటి దుష్ట ఆలోచనలూ కలుగవు. మనస్సు ఎప్పుడూ సత్కర్మలయందే నిమగ్నమౌతుంది. ఎల్లప్పుడూ ఆ దివ్య పాదాలను స్మరించేవారికి వాక్శుద్ధి కలుగుతుంది. వారు పలికే ప్రతీమాట నిజమౌతుంది. నిత్యం ఆ స్వామి దివ్య చరణాలనే తలుస్తూ వుండే వారి ఇంట అగ్ని భయం, చోర భయం వుండదు' అని ఆ మహర్షి రామాచారితో సహా

# శ్రీచరణామృతము

అక్కడున్న భక్తులందరికీ శ్రీమన్నారాయణులవారి దివ్య పాద మహిమను వివరంగా చెప్పాడు. ఆ విశేషాలన్నీ విన్న భక్తులందరూ ఎంతో సంతోషించి ఆ యోగీశ్వరునికి నమస్కరించారు. అప్పుడు ఆ మహర్షి వారందరినీ ఆశీర్వదించి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. భక్తులందరూ కొండనెక్కడం కొనసాగించారు. రామాచారికి ఆ వచ్చిన సాధువు ఎవరై వుంటారా అనిపించింది. శ్రీమన్నారాయాణులవారి దివ్య గుణగణాలను అంత అద్భుతంగా వివరించాడంటే అతడెవరో మహా పురుషుడై వుండాలి అని తోచింది. అప్పుడు రామాచారికి శ్రీమన్నారాయణులవారు చెప్పిన సప్తఋషుల సంగతి గుర్తుకు వచ్చింది. వచ్చినది సాక్షాత్తూ సప్తఋషులలో ఒకరైన అగస్త్యులవారని అర్థమయ్యింది. అంతటి మహాపురుషుని దర్శనభాగ్యం కలగటం తమ అదృష్టమని తలచి సంతోషించాడు.

భక్తులందరూ చుట్టూ ఉన్న ప్రకృతి రమణీయతకు ఎంతో ఆనందపడుతూ కొండనెక్కసాగారు. ఈ బ్రహ్మాండంలో అన్నింటికన్నా ముందుగా వున్నది ఈ తిరుమల గిరులే. ఇక్కడనుంచే సృష్టిమొత్తం ఆవిర్భవించింది. ఈ పవిత్రకొండపై నుంచే బ్రహ్మదేవుడు సమస్త విశ్వాన్ని సృష్టించాడు. ఈ తిరుమల గిరులలో మన కంటికి కనపడే ప్రతీ చెట్టు, ప్రతీ మొక్క అతి పవిత్రమైనవే. శ్రీమన్నారాయణుడు శ్రీనివాసునిగా ఈ కొండపై వెలసినపుడు దేవతలందరూ అమృతవర్షం కురిపించారు. ఆ అమృతధారలే ఈ కొండలపై ఏరులుగా పారి, ఘనీభవించి, కాలక్రమేణా శిలలుగా మారాయి. అమృత ఐశ్వర్యాలకు నిలయం కాబట్టి ఈ కొండ వేంకటాద్రిగా పిలవబడుతున్నది. ఆనాడు దేవతలు కురిపించిన పుష్పవృష్టి ఫలితంగా ఈ కొండపై ఎన్నో అద్భుత పూలమొక్కలు పెరుగుతున్నాయి. దేవలోకంలో మాత్రమే లభ్యమయ్యే పూలమొక్కల జాతులన్నీ ఈ తిరుమలకొండపై చూడవచ్చును. అందుకే ఈ తిరుమల గిరులు అద్భుత సౌందర్యంతో విరాజిల్లుతూ వుంటాయి.

తిరుమల ప్రకృతి అందాలను తనివితీరా ఆస్వాదిస్తూ రామాచారి దంపతులతో సహా భక్తులందరూ మూడవ కొండనెక్కడం పూర్తి చేసి నాలుగవ కొండపై కాలు పెట్టారు. కొంతదూరం నడచిన తరువాత ప్రకృతి అంతా ఒక్కసారి ఎంతో చల్లగా,

మరింత అందంగా కనిపించింది. చల్లని పిల్లగాలులు అద్భుతంగా వీచసాగాయి. భక్తులందరూ ఎంతో ఆనందపడుతుండగా ఒక్కసారిగా ఎదురుగా ఆకాశంలో దిక్కులు పిక్కటిల్లేటటువంటి శబ్దంతో ఒక మెరుపు మెరిసింది. ఆ కాంతికి భక్తులందరూ ఒక్కసారి కనులు మూసుకున్నారు. కనులు తెరిచి ఆకాశం వైపు చూసిన భక్తుల ఆనందానికి అంతు లేదు. అక్కడ ఆకాశంలో శ్రీమన్నారాయణులవారి దివ్య పాదాలు అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తూ క్షణకాలం దర్శనమిచ్చాయి. ఆ అద్భుత దృశ్యానికి భక్తులందరూ ఎంతో సంతోషపడ్డారు. ఆహా! ఇదంతా మా పూర్వజన్మ పుణ్యఫలం తప్ప మరొకటి కాదు. ఆ శ్రీమన్నారాయణులవారి దివ్య పాద దర్శనంచేత మా జన్మ తరించింది అని తలచారు. ఇంతలో వెనుక నుంచి ఒక భక్తుల బృందం వచ్చి వారిని కలిసింది. వారందరికీ రామాచారి బృందంవారు ఆకాశంలో శ్రీమన్నారాయణులవారి దివ్యపాద దర్శనం గురించి చెప్పారు. అయ్యో! ఒక్క క్షణం ముందు వచ్చి వుంటే తాము కూడా ఆంతటి అద్భుత దృశ్యం చూచేవారము కదా అనుకున్నారు.

ఇంతలో ఒక వృద్ధభక్తుడు అడవిలోనుంచి ఇటుగా వచ్చి వీరి కోలాహలం చూసి వీరివద్ద కాసేపు ఆగి విశేషమేమిటని అడిగాడు. అప్పుడు వారందరూ తమకు ఆకాశంలో అద్భుతంగా శ్రీమన్నారాయణులవారి దివ్య పాద దర్శనం జరిగిందని చెప్పారు. అప్పుడు ఆ వృద్ధభక్తుడు వారితో ఇలా అన్నాడు. ‘నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! మీరందరూ ఎంతో పుణ్యాత్ములు. అందువలననే ఆ స్వామి చరణాల దివ్యదర్శన భాగ్యం కలిగింది. అందునా తిరుమలకొండపై కలిగింది అని అన్నాడు. అప్పుడు భక్తులు స్వామీ మీరెవరో మహానుభావులవలె ఉన్నారు. ఈ విధంగా స్వామివారి దివ్య పాద దర్శనం ఇలా జరగడం ఇంతకు మునుపు ఎప్పుడైనా చూశారా అని అడిగాడు. అప్పుడా వృద్ధభక్తుడు వారితో ఇలా అన్నాడు. ఇది చాలా విశేషమైనది, మీలో రామాచారి అనే గొప్ప భక్తుడు వున్నాడు. అతని వలననే మీ అందరికీ కూడా స్వామి వారి దివ్య పాద దర్శన భాగ్యం కలిగింది అని అన్నాడు. ఈ మాటలు విన్న రామాచారి ఆ సాధువుకు నమస్కరించి, స్వామీ!

# శ్రీచరణామృతము

నేనే రామాచారిని, నేను ఈ జన్మలో ఏ పుణ్యకార్యాలు చేయలేదే? యజ్ఞాలూ, యాగాలూ చేయలేదే? అయినా ఆ స్వామి నన్ను ఇంతగా ఇలా కరుణించాడు? అని అడిగాడు. అప్పుడు ఆ సాధువు ఇలా చెప్పసాగాడు. నాయనా! ఇక్కడ నీకొక రహస్యం చెప్తాను విను. మీరందరూ కూడా సావధానంగా వినండి. ఈ రామాచారి కిందటి జన్మ పుణ్యఫలంగా ఈ రోజు మీ అందరికీ శ్రీమన్నారాయణులవారి దివ్య పాద దర్శన భాగ్యం కలిగింది' అని అన్నాడు. అప్పుడు రామాచారితో సహా భక్తులందరూ ఆ సాధువుకు నమస్కరించి, రామాచారికి అంత పుణ్యఫలం ఎలా వచ్చింది అని అన్నారు.

అప్పుడు ఆ సాధువు వారితో 'నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! ఈ రామాచారి పూర్వజన్మ వృత్తాంతం చెప్తాను, సావధానంగా వినండి అని ఇలా చెప్పసాగాడు. నాయనలారా! శ్రీమన్నారాయణులవారు భక్తవత్సలుడు. తనను పూర్తిగా నమ్మేవారి భారం తానే వహిస్తాడు. వారికి సర్వసౌభాగ్యాలూ సమకూరుస్తాడు. ఎటువంటి ఆపదా వారి దరి చేరనీయడు. రామాచారి పూర్వజన్మలో కొండాపురం అనే గ్రామంలో జంగయ్య అనే పేరుతో చెప్పులు కుట్టే వానిగా జన్మించి ఎంతో సత్ప్రవర్తనతో వుండేవాడు. ఎవ్వరినీ ఇబ్బంది పెట్టకుండా ఎంత ఇచ్చినా ఏమీ అనకుండా తీసుకునేవాడు. రోజూ ఈ విధంగా చెప్పులు కుట్టగా వచ్చిన ధనంతో సంసారం సాగిస్తూ వుండేవాడు. ఆ వూరిలో ఒక రామాలయం వుండేది. ఆ వూరి పెద్దలు చాలా కర్కశంగా వుండేవారు. జంగయ్యను తక్కువ జాతివాడివని చెప్పి ఆలయంలోకి రానిచ్చేవారు కాదు. కానీ జంగయ్యకు ఎప్పటికైనా ఆ స్వామిని దర్శించుకోవాలని ఎంతో కోరికగా వుండేది. ప్రతీ సంవత్సరం చైత్రమాసంలో జరిగే ఆలయ ఉత్సవాలలో భాగంగా శ్రీ స్వామివారిని ఉభయ దేవేరులతో ఊరంతా ఊరేగించినపుడు ఆ ఉత్సవ మూర్తులు తాను చెప్పులు కుట్టుకుంటూ కూర్చునే వీధిలోనుండి వెళుతున్నప్పుడు దూరంనుంచే దర్శించి ఎంతో ఆనందపడేవాడు.

జంగయ్య రోజూ ఇంటినుంచి ఆలయ వీధి ద్వారానే తాను పనిచేసే ప్రదేశానికి

వచ్చేవాడు. ఆలయంలోనికి తనను రానివ్వనందుకు బాధపడేవాడు. ఒకరోజు ఆలయం ముందు నుంచి నడుస్తూ ఒక్కసారి లోపలికి చూడగా ఎదురుగా గర్భగుడిలోని స్వామివారి పాదాలు కనిపించాయి. గర్భగుడికి వున్న తెర చిన్నదవటంచేత స్వామివారి పాదాలు బయటకు కనిపిస్తున్నాయి. ఆ పాద దర్శనానికి జంగయ్య ఎంతో సంతోషపడ్డాడు. తన అదృష్టానికి ఎంతో మురిసిపోయాడు. రోజూ ఆ వీధిలో వెళుతున్నప్పుడు ఆలయం ముందుకు రాగానే ఒక్కసారి ఆవైపుకు చూసి ఆ పాదాలకు నమస్కరించేవాడు. ఎప్పుడైనా తెర తొలగి స్వామివారి దివ్య మంగళ విగ్రహం దర్శనం ఇస్తుందా అని తలచేవాడు. కానీ ఎప్పుడూ తాను ఆశించినట్లు జరగలేదు. అయినా ఏమీ నొచ్చుకోకుండా ఆ పాద దర్శనభాగ్యమే మహాప్రసాదమని తలచేవాడు. ఇలా జీవించినంత కాలం ఆ స్వామి పాదాలనే దర్శిస్తూ, స్మరిస్తూ గడిపాడు. శ్రీమన్నారాయణులవారి దివ్య చరణాలను దర్శించినా, స్మరించినా ఎన్ని జన్మల పాపాలైనా నశిస్తాయి. సర్వ సౌభాగ్యాలూ కలుగుతాయి. జంగయ్య ఆ విధంగా స్వామివారి పాదాలను దర్శించిన పుణ్యంచేత మరు జన్మలో ఆ స్వామి వద్దనే వుండి నిత్యం సేవించే భాగ్యం లభించేలా అర్చకునిగా జన్మించాడు. ఆ పుణ్యఫలంచేతనే ఈనాడు అతనికి, అతనితోపాటు మీ అందరికీ ఆ స్వామి దివ్యచరణదర్శనభాగ్యం కలిగింది అని చెప్పాడు.

ఇదంతా రామాచారి కనులవెంట ఆనందభాష్పాలు రాలాయి. ఆ స్వామి తనపై చూపిన అద్భుత అనుగ్రహానికి కనుల నీరు కారాయి. ఆ సాధువుతో ఇలా అన్నాడు. 'స్వామీ మీరెవరో దివ్య పురుషులవలె వున్నారు. నా పూర్వజన్మ వృత్తాంతాన్ని ఎంతో చక్కగా విశదీకరించారు. మీకు నా నమస్కారములు' అని అన్నాడు. అప్పుడు ఆ సాధువు, నాయనా! ఇందులో నాదేమున్నది, నీవు చేసిన ఆ శ్రీచరణసేవయే నిన్ను అనుగ్రహించింది. శ్రీమన్నారాయాణులవారి దివ్య పాద మహిమ అంతటిది. ఆ పాద దర్శనం కోటి జన్మల పాపాలను క్షణంలో నశింపచేస్తుంది. ఎంతటి కష్టంలో వున్న వారైనా ఒక్కసారి ఆ శ్రీమన్నారాయణులవారి దివ్య పాదాలను మనస్సులో స్మరిస్తే చాలు, క్షణంలో ఆ కష్టం

మాయమౌతుంది. మనస్సు అశాంతిగా వున్నప్పుడు స్వామివారి పాదాలనే కనుల ముందు దర్శిస్తూ వుంటే మనసంతా తేలిక పడుతుంది. మనసులోని చికాకు, అశాంతి వెంటనే మాయమౌతుంది. రోజూ స్వామి పాదాలను స్మరించేవారికి ఉత్తమ గతులు లభిస్తాయి. ఏ శ్లోకాలూ చదవటం రాదని చింతించనక్కరలేదు. కేవలం ఆ పాదాలను ఒక్కసారి స్మరించినంత మాత్రముననే ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. ఆ శ్రీనివాసుని పాదసేవ ఎంతటి మహాపుణ్యాన్నిస్తుందో తెలియపరచే రామనాథం అనే శిల్పి కథ చెప్తాను వినండి' అంటూ ఇలా చెప్పసాగాడు. 'నాయనాలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! ఆ శ్రీనివాసునిపై మీకుగల అపారభక్తికి నాకెంతో సంతోషం. ఇంతకుముందు చెప్పినట్లుగా శ్రీమన్నారాయాణులవారి అనుగ్రహం పొందడానికి కావలసింది నిష్కల్మషమైన భక్తి, స్వామిపై అపారమైన ప్రేమ కలిగి ఉండటం' అని అన్నాడు.

ఆ సాధువు రామనాథం అనే శిల్పి కథ ఇలా చెప్పసాగాడు. 'పూర్వకాలంలో రామాపురం అనే గ్రామంలో రామనాథం అనే శిల్పి వుండేవాడు. అతడు తరతరాలుగా వస్తున్న శిల్పకళనే నమ్ముకుని జీవితం గడుపుతున్నాడు. వృత్తిరీత్యా ఎన్నో రకాల శిల్పాలు చెక్కుతున్నప్పటికి శ్రీమన్నారాయణులవారి దివ్య మంగళ స్వరూపాన్ని శిల్పంలా చెక్కే మహా భాగ్యం ఇంకా రాలేదని చింతిస్తూ వుండేవాడు. కరుణామూర్తి అయిన శ్రీ స్వామివారు ఇతనిని చివరకు అనుగ్రహించారు. ఆ ఊరిలో ప్రముఖ వ్యాపారులందరూ కలిసి శ్రీమన్నారాయణులవారి ఆలయం నిర్మింప దలచారు. శ్రీ స్వామివారి శిల్పాన్ని చెక్కే బాధ్యతను రామనాథానికి అప్పచెప్పారు. ఆలయ ధర్మకర్తల మండలిలో కొందరు సభ్యులు ఊరికి చాలా దూరంలో గల ఒక పెద్ద శిల్పికి ఈ బాధ్యత ఇద్దామని తలచినా శ్రీ స్వామివారి అనుగ్రహం చేత మరికొంత మంది సభ్యులు మన ఊరివాడైన రామనాథంచేతే ఈ విగ్రహం తయారు చేయించాలని పట్టుపట్టడంతో ఆ అవకాశం చివరికి రామనాథానికే దక్కింది.

రామనాథం శ్రీమన్నారాయణులవారి శిల్పం చెక్కే పనిని ఎంతో నిష్టగా చేయసాగాడు. ప్రతీరోజూ పని మొదలుపెట్టే ముందు ఒక్కసారి స్వామిని మనసులో

ప్రార్థించి, పనికి ఉపక్రమించేవాడు. ఎన్నో జన్మల పుణ్యఫలం ఫలితంగా తనకు ఈ మహాభాగ్యం కలిగిందని తలచి, ఎంతో శ్రద్ధగా శిల్పం చెక్కేవాడు. కొన్ని రోజులకు అద్భుతమైన దివ్య మంగళ రూపంతో శ్రీమన్నారాయణులవారి విగ్రహం రూపొందుకున్నది. ఇక కొన్ని రోజులలో ఈ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించడానికి తీసుకువెళతారని రామనాథం మనస్సులో బెంగ మొదలైంది. స్వామి వారి రూపం ఇన్ని రోజులుగా చెక్కుతున్నందుకు ఆ విగ్రహంతో, ఆ స్వామి రూపంతో అతనికి ఒక అనిర్వనీయమైన అనుబంధం ఏర్పడింది. అయ్యో! ఇక కొన్ని రోజులలో ఈ స్వామివారు తననుంచి దూరంగా వెళ్ళిపోతారనే ఆలోచన వచ్చినప్పుడల్లా ఎంతో బాధ కలిగేది. ఒకవేళ తనే ఈ దివ్య మంగళ విగ్రహాన్ని ఎప్పటికీ ఉంచేసుకుంటేనో అనుకున్నాడు. కానీ ధర్మకర్తలు అందకు ససేమిరా ఒప్పుకోరని తెలుసు. ఇంతలో విగ్రహం పూర్తయి తన ఇంటి ఆవరణలో వున్న ఒక పక్కగా గోడవద్ద పెట్టి వుంచాడు. ఆహా! ఎంత అద్భుతంగా వున్నాడో కదా స్వామీ!' అని తలచాడు. ఆ తరువాత రెండు రోజులకే ఆలయ ధర్మకర్తలు వచ్చి ఆ విగ్రహాన్ని తీసుకుని వెళ్ళారు.

విగ్రహం వెళ్ళిన తరువాత రామనాథం కంటికి కునుకులేదు. జీవితంలో అన్నీ కోల్పోయిన భావం కలిగింది. స్వామి దూరం అయిపోయాడా, అని బాధ పడ్డాడు. ఆహా! ఆ చక్కటి చుబుకం, దివ్యమైన కంఠం, విశ్వానికంతా రక్షగా భాసిస్తూ, చిరునవ్వు నవ్వుతున్న పెదవులు, దివ్యమైన కటి వరద హస్తాలు, బ్రహ్మ కడిగిన దివ్య పాదాలు, ఆహా! ఎంత అద్భుతమైన రూపం, అని తలుస్తూ కంటినిండా సరిగా నిద్రపోలేదు. ఇంతలో తెల్లవారింది. ఆవరణలోనికి వచ్చిన రామనాథానికి ఒక అపూర్వదృశ్యం కంటపడింది. నిన్నటివరకు స్వామివారి శిల్పాన్ని నిలబెట్టినచోట పాదముద్రలు వున్నాయి. స్వామి విగ్రహాన్ని కొన్ని రోజులు అక్కడ నిలిపి వుంచటం వలన అక్కడ మట్టిలో విగ్రహం బరువుకు స్వామి పాద ముద్రలు పడ్డాయి. ఆ దృశ్యం చూసిన రామనాథం వెంటనే ఆ దివ్య పాదాలకు నమస్కరించాడు. అతనికి మనస్సులో ఒక ఆలోచన మెరిసింది. వచ్చిందే తడవుగా ఆచరణలో పెట్టాడు. త్వర త్వరగా స్నానం చేసి ఆ పాద గుర్తులు పడినచోట పైన తాటాకులతో చిన్న పందిరిలాగా

ఏర్పాటు చేశాడు. ఇంటి ఆవరణలోని పూలమొక్కల నుంచి కొన్ని పూలు తీసుకుని వచ్చి పాదాలవద్ద వుంచి నమస్కరించాడు. అప్పటినుంచి ప్రతిరోజు స్వామిపాదాల వద్ద పుష్పాలను సమర్పిస్తూ ఎంతో మురిసిపోయాడు. రామనాథం పిల్లలిద్దరూ పెరిగి పెద్దవాళ్ళయ్యారు. ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో ఎంతో గొప్ప శిల్పి అన్న పేరు ప్రఖ్యాతులు వచ్చి ఎప్పుడూ చేతినిండా పని వుండేది. స్వామి అనుగ్రహంతో ఆ కుటుంబం యొక్క జీవితం దివ్యంగా గడిచిపోతుండేది.

ఇలా వుండగా స్వామి వారి విగ్రహం ప్రతిష్టింపబడిన ఆలయంలోని అర్చకునికి ఒక సందేహం వచ్చింది. మనం రోజూ ఈ స్వామిని ఇంతగా అర్చిస్తూ, కొలుస్తున్నాము కదా, మరి మా జీవితాలలో ఏ మార్పూ రాలేదు కానీ, ఆ విగ్రహాన్ని చెక్కిన అతి సామాన్యుడైన ఆ శిల్పి జీవితంలో ఎందుకు అంత ఉన్నత స్థితి లభించింది అని తలచాడు. ఈ సంగతి రామనాథాన్నే అడుగుదామని తలచి ఒకనాడు ఉదయం అర్చన పూర్తికాగానే అతనింటికి వెళ్లాడు. ఆ సమయంలో రామనాథం పెరట్లో ఒక చిన్న పందిరి వద్ద నుంచుని నమస్కరిస్తూ కనబడ్డాడు. అక్కడ ఏముందా అని అర్చకుడు ఆత్రంగా చూసేటప్పటికి శ్రీవారి దివ్య పాదముద్రలు కనిపించాయి. జరిగినదంతా అర్చకులవారికి అర్థమైంది. స్వామికి కావలసింది స్వచ్ఛమైన భక్తి, ప్రేమ, అనురాగం, ఈ రామనాథం మట్టిలో ఏర్పడిన ఆ పాద ముద్రలనే తన సర్వస్వంగా భావించి నిత్యం కొలుస్తున్నాడు. స్వామి తన ఇంటనే వున్నట్టు భావిస్తున్నాడు. వ ఎరితే నో? ఎ ప్పుడూఆ స్వామివి గ్రహంవ ఖందేవ్రంటున్నానన్న అతిశయంతో, అహంకారంతో వుంటున్నాడు. అంతేకాక అది కేవలం శిలా విగ్రహం అని భావించాడు తప్ప, సాక్షాత్తూ స్వామివారే అక్కడ వున్నారన్నట్లు ఎప్పుడూ తలచలేదు, అందువలననే తనకు స్వామివారి అనుగ్రహం కలగలేదని ఆ అర్చకుడు గ్రహించాడు', ఈ విధంగా ఆ సాధువు రామాచారితో సహా వున్న భక్తులందరికీ రామనాథం కథ చెప్పి ఇంకా ఇలా అనసాగాడు. 'నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! చూశారు కదా శ్రీమన్నారాయణులవారి భక్త వాత్సల్యత! శ్రీస్వామివారి పాద పూజా మహిమ! శ్రీమన్నారాయణులవారికి కావలసింది

నిష్కల్మషమైన భక్తి. ఎవరైతే ఆ స్వామి దివ్య పాదాలను మనసారా స్మరిస్తారో వారికి సర్వ సౌభాగ్యాలూ చేకూరుతాయి. వారికి ఎటువంటి అపదలూ దరి చేరవు. అనుకున్న కార్యాలన్నీ దిగ్విజయంగా చేకూరుతాయి' అని అన్నాడు ఆ సాధువు.

రామాచారితో సహా మిగిలిన భక్తులందరికీ అలా చెప్పిన ఆ సాధువు తిరిగి అడవిలోనికి తన ఆశ్రమంవైపు వెళ్ళిపోయాడు. ఆ వైపే చూస్తున్న రామాచారికి ఆ సాధువు సప్త ఋషులలో ఒక్కరైన అత్రి మహామునిగా గ్రహించాడు. ఆహా! తమ అదృష్టం కదా. అంతటి మహామునీశ్వరుల ద్వారా దివ్య లీలలు వినగలిగాము అని ఆనందపడ్డాడు. భక్తులందరూ తిరిగి తమ నడక కొనసాగించారు. తిరుమల గిరులన్నీ ఎంతో అద్భుత ప్రకృతి సౌందర్యంతో కంటికి ఎంతో ఆనందం కలుగజేస్తున్నాయి. యుగ యుగాలుగా ఎందరో మహా పురుషులు నడిచిన ఈ కొండపై తాము నడవగలగడం తమ భాగ్యంగా వారందరూ భావించారు. అంతటి మహా పురుషులు నడచిన ప్రదేశం కాబట్టి ఈ తిరుమల గిరులలో వారి దివ్య తేజస్సు ఇంకా ప్రకాశిస్తున్నది. అందువలననే కొండనెక్కే భక్తులు ఏ మాత్రం అలసట లేకుండా ఎంతో ఆనందంగా ఎక్కగలుగుతారు. అంతేకాక ఒకసారి తిరుమల కొండ ఎక్కితే శరీరంలోని అనారోగ్యమంతా తొలగిపోయి కొన్ని సంవత్సరాల వరకు ఎటువంటి శారీరక బాధలూ కలగవు. అంతటి దివ్య తేజస్సును ఈ కొండ తనలో నింపుకున్నది.

భక్తులందరూ శ్రీమన్నారాయణులవారి గుణగుణాలను కీర్తిస్తూ నాలుగవ కొండ నెక్కటం పూర్తి చేసి అయిదవ కొండపై కాలు పెట్టారు. కొంతదూరం వెళ్లిన తరువాత వారికి మరొక భక్తుల బృందం కలిసింది. అందరూ కలిసి నడవసాగారు. ఇంతలో ఒక్కసారిగా పెద్ద వర్షం మొదలైంది. అందరూ కలిసి దగ్గరలో వున్న పెద్ద చెట్టుకింద వర్షానికి తడవకుండా నిల్చున్నారు. ఆ వర్షం ఎంతకీ తగ్గేలా లేదు. అప్పుడు వారికి తాము అక్కడికి రాకముందునుంచే చెట్టుకు ఆనుకుని కూర్చుని ఉన్న ఒక వృద్ధభక్తుడు కనిపించాడు. రామాచారి అతడి సమీపానికి వెళ్లి నమస్కరించాడు. అప్పుడతడు నాయనా! మీరందరూ ఆకలిగా ఉన్నట్లున్నారు. వర్షం ఇప్పుడిప్పుడే తగ్గేలా

కనిపించటలేదు. నా దగ్గర బోలెడు జామపండ్లు వున్నాయి. ఇవన్నీ మీరు తీసుకోండి అని ఆ జామపండ్లు భక్తులకు ఇచ్చాడు. అప్పుడు రామాచారి అతడికి నమస్కరిస్తూ, స్వామీ చాలా సంతోషం, తమరి నామధ్యేయం ఏమిటని అడిగాడు. 'నా పేరు భద్రయ్య, ఎంతో కాలం నుండి స్వామినే సేవిస్తూ ఈ కొండపైనే నివసిస్తున్నాను. ఇలా నిత్యం కొండనెక్కే భక్తులకు నాకు చేతనైన సహాయం చేస్తున్నాను అని అన్నాడు. భక్తులందరూ భద్రయ్య ఇచ్చిన జామకాయలు తిని ఇన్ని సంవత్సరాలుగా స్వామిని సేవిస్తున్న మీకు ఎన్నో విశేషాలు తెలిసి వుంటాయని కొన్ని తమకు చెప్పమని భద్రయ్యను వేడుకున్నారు.

అప్పుడు భద్రయ్య భక్తులకు ఇలా చెప్పసాగాడు. నాయనలారా! మీరందరూ ఎంతో కష్టపడి ఈ తిరుమల యాత్ర సంకల్పించి స్వామిని దర్శించడానికి వచ్చారంటే ఆ స్వామిపై మీకు గల అపారభక్తి అర్థమౌతోంది. మీరందరినీ చూస్తుంటే నాకెంతో ముచ్చటగా వుంది. మానవజీవితం అతిస్వల్పమైనది, ఎవరు ఎన్నాళ్ళు జీవిస్తారో ఆ పరంధామునికే ఎరుక. జీవించినంతకాలం సత్ప్రవర్తనతో కాలం గడపాలి. మన దైనందిన పనులు మనం చేసుకుంటూ ఆ శ్రీమన్నారాయణుని నామం స్మరిస్తూ జీవించాలి. అంతేకానీ స్వార్థపూరిత జీవితం గడపరాదు. నేను ఎన్నో సంవత్సరాలుగా ఇక్కడ వుంటూ స్వామి దర్శనార్థమై వచ్చే భక్తులను గమనిస్తున్నాను. వారిలో కొందరు తమ కష్టాలనుండి కాపాడమని స్వామికి విన్నవించుకోవడానికై వస్తారు. మరికొందరు ఐశ్వర్యాన్ని ఆశించడానికి వస్తారు. కొందరు అనారోగ్యం నుండి కాపాడమని ప్రాధేయపడటానికి వస్తారు. ఏ కోరికలూ లేకుండా కేవలం స్వామిని దర్శించి, ధన్యులమవుదామని అనుకొని వచ్చేవారు చాలా తక్కువ. మనకేం కావాలో, ఆ శ్రీనివాసునికి తెలిసినట్టు మరెవరికి తెలుస్తుంది? ఆ స్వామియే మనలందరిని సృష్టించింది. మనకేం కావాలో స్పష్టంగా మనకే తెలీదు, ఏవేవో కోరికలు కోరతాం. ఏ కోరికలూ లేకుండా ఆ స్వామిని ప్రార్థిస్తే మనకు కావలసినవన్నీ ఆ స్వామే సమకూరుస్తాడు. జీవితంలో దేనికీ లోటు వుండదు. భార్య, పిల్లలని, బంధువులని మమకారాలు పెంచుకొనకూడదు. ఈ సృష్టిలో ఏ

బంధం శాశ్వతం కాదు. ఈ విశాల ప్రపంచంలో ఒక మనిషియొక్క జీవితం ఎంతటిది? ఎంతో విలాసవంతమైన జీవితాలు గడిపిన రాజులు, భూమండలం మొత్తం ఏలిన చక్రవర్తులు కాలగర్భంలో కలిసిపోయారు. అలాగే రేపు మనం కూడా. ఈ సృష్టిలో శాశ్వతమైనది జీవులందరి హృదయాలలో అంతర్యామి స్వరూపంలో వుండే ఆ పరబ్రహ్మమూర్తి ఒక్కడే. అందుకే ఆ స్వామినే శరణువేడి ఈ బాహ్యబంధాలను వీడి విముక్తి చెందాలి. ఈ బంధాలన్నింటినుండి తేలికగా బయటపడగలిగే సాధనం భక్తి ఒక్కటే! ఆ శ్రీమన్నారాయణులవారిపై అచంచల భక్తి విశ్వాసాలు కలిగివుండటమే మానవ జీవిత లక్ష్యం. ఆ శ్రీనివాసుని పాదాలను ఆశ్రయిస్తే చాలు. అంతకుమించిన పరమావధి మరొకటి లేదు అని అన్నాడు.

భద్రయ్య చెప్పినదంతా భక్తులందరూ ఎంతో శ్రద్ధగా విన్నారు. అప్పుడు వారిని ఉద్దేశించి ఇంకా ఇలా చెప్పసాగాడు. 'శ్రీమన్నారాయణుడు జగత్ప్రభువు. జగద్రక్షకుడు. ఇంతకు ముందు చెప్పినట్లుగా ఇహలోకపు బంధాలనుంచి, మోహాలనుంచి విముక్తులై మానవులందరూ ప్రశాంత మనసుతో జీవించాలి. చాలామంది మానవులు చిన్న చిన్న విషయాలపై ఎంతో మమకారాన్ని పెంచుకుంటారు. ఒకరు తను నిత్యం వాడే కలంపై ఎంతో మమకారాన్ని పెంచుకుంటారు. ఏ కారణాలచేతైనా అది పోయినప్పుడు ఎంతో అశాంతికి లోనై తమ ఇంటిలోని సభ్యులందరినీ అరచి, ఎవరికీ ప్రశాంతత లేకుండా చేస్తారు. మరొకరు తము ధరించే వస్త్రాలపై మమకారం పెంచుకుంటారు. ఇలా మానవులు తమ కుటుంబ సభ్యులమీదే కాకుండా ఇంట్లోని అనేక వస్తువులపై మోహం పెంచుకుంటారు. ఆ మమకారం ఎంత తీవ్రంగా వుంటుందంటే వాటిని కోల్పోయిన తక్షణం ఎంతో కోపానికి, అసహనానికి గురౌతారు. ఏ వస్తువునందైనా మమకారం అది తనది అనుకోవటం వలననే వస్తుంది. అంతేకాక అది శాశ్వతంగా తనదే అవుతుందన్న భ్రమలో వుండటం వలనకూడా వస్తుంది. కానీ నిజానికి ఈ సృష్టిలో ఏదీ ఎవరి సొంతం కాదు కదా. మనం ఈ మాత్రేనికే ఇలా అనుకుంటే ఇంతకు మునుపు కాలంలో మరెంతో విలువైన వస్తువులను స్వంతం అని భావించిన చక్రవర్తుల

# శ్రీచరణామృతము

సంగతేమిటి, అన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి కదా. ఈ విశ్వంలో ఏదీ శాశ్వతం కాదు, శాశ్వతమైనది పురుషోత్తముడైన ఆ శ్రీమన్నారాయణుడొక్కడే. ఆ స్వామి చరణాలనే నమ్మి కొలచేవారికి ఎటువంటి ప్రాపంచిక విషయాల మీద మక్కువ ఉండదు. ఆ స్వామి దివ్య పాదాలను ఆశ్రయిస్తే వారికి ఎటువంటి మోహావేశాలు దరిచేరవు. ఆ స్వామి చరణసేవ ఎంతటి మహత్తరమైనదో చెప్తాను వినండి. అంటూ భద్రయ్య ఇంకా ఇలా చెప్పసాగాడు.

నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! పూర్వకాలంలో వేంకటాపురం అనే గ్రామంలో శ్రీమన్నారాయణులవారి దేవాలయం వుండేది. ఆ ఆలయంలో సుబ్బడు అనే పనివాడు వుండేవాడు. అతడు ఆలయంలోనే ఒక మూల చిన్న గదిలో నివసిస్తూ ఆలయ ఆవరణమొత్తం నిత్యం శుభ్రపరుస్తూ ఉండేవాడు. ఒకసారి ఆలయ ఉత్సవాల సందర్భంలో పండితులచే భాగవత ప్రవచనాలు జరిగాయి. ఆ ప్రవచనాలలో భాగంగా ఒకనాడు వేంకటశర్మ అనే పండితుడు శ్రీమన్నారాయణతత్వం బోధిస్తూ శ్రీనివాసునికి తులసి అంటే అత్యంత ప్రీతికరమని, ఎవరైతే నిత్యం శ్రీనివాసుని తులసి దళాలతో పూజిస్తారో వారికి సర్వసౌభాగ్యాలూ కలుగుతాయని, మరుజన్మ వుండదని అన్నాడు. శ్రీనివాసుని పాదాల వద్ద రోజూ ఒక్క తులసీదళం వుంచితే వెయ్యి అశ్వమేధ యాగఫలం లభిస్తుందని చెప్పాడు. ఈ మాటలు సుబ్బయ్య కూడా విన్నాడు. అతని మనస్సులో వేంకటశర్మ చెప్పిన తులసీదళ మహత్యం బాగా నాటుకున్నది. తాను ఏ చదువులూ లేనివాడు, ఏ స్తోత్రాలూ తనకు రావు, ఆ స్వామిని భక్తులందరూ ఏవేవో కీర్తనలు పాడుతూ, పూజలు చేస్తుంటారు. తనకు మరి అవేమీ రావాయె. తనను గర్భగుడిలోనికి వెళ్ళనివ్వరు. మరి తులసిదళాలను స్వామి పాదాలవద్ద ఎలా వుంచాలి అని తలచాడు. అప్పుడు వాడికి ఒక ఆలోచన వచ్చింది. ఆ ఆలయంలో భక్తులు అమర్చిన ఎన్నో భగవంతుని చిత్రపటాలు వున్నాయి. వాటిలో ఒక పటంలోని స్వామికే తులసి సమర్పించవచ్చు కదా అనే ఆలోచన కలిగింది. మరుసటి రోజునుంచి సుబ్బయ్య ప్రతిరోజూ తులసీదళాన్ని ఆ చిత్రపటంలోని స్వామివారి పాదాల వద్ద వుంచేవాడు.

# శ్రీచరణామృతము

ముందురోజు సమర్పించిన తులసీదళాన్ని మరునాడు కనులకద్దుకొని స్వామి ప్రసాదంగా స్వీకరించేవాడు. ఆ విధంగా కొన్ని సంవత్సరాలు చేయడంచేత సుబ్బయ్యకు శ్రీ స్వామి వారి అనుగ్రహం కలిగి సుపుత్రుడు కలిగాడు. అతడు పెద్దవాడై చక్కగా చదువుకుని ఆ ఊరి గ్రామాధికారి వద్ద కొలువులో చేరాడు. సుబ్బయ్య జీవించినంత కాలం సుఖంగా జీవించి, చివరన ముక్తిని పొందాడు. శ్రీ స్వామివారి పాదసేవ అంతటి మహిమ కలది. ఒక్క తులసీదళం నిత్యం స్వామివారి పాదాల వద్ద ఎవరైతే వుంచుతారో వారికి ఎటువంటి భయాలూ కలుగవు. ఎటువంటి అనారోగ్యమూ దరిచేరదు. సర్వసౌభాగ్యాలూ కలుగుతాయి అని చెప్పాడు.

భద్రయ్య మాటలు విన్న భక్తులందరూ ఎంతో సంతోషించారు. అప్పుడు రామాచారి భద్రయ్యతో ఇలా అన్నాడు. స్వామీ! ఆ శ్రీమన్నారాయణుని లీలలను తమరు అద్భుతంగా వివరించారు. విన్నకొద్దీ వినాలని అనిపిస్తున్నది. వర్షం ఇంకా తగ్గలేదు. మమ్మల్ని అనుగ్రహించి శ్రీనివాసుని శ్రీచరణాల మహిమలను ఇంకా వివరింపవలసింది అని కోరాడు. అప్పుడు భద్రయ్య రామాచారి మాటలకు ఎంతో ఆనందించి వారందరికీ శ్రీనివాసునిపై గల భక్తికి ఎంతో సంతోషించి ఇలా చెప్పసాగారు. నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! మీకు ఆ శ్రీనివాసునిపై గల భక్తికి నాకెంతో ఆనందముగా వున్నది. ఆ స్వామి గుణగణాలను ముచ్చటించుకోవటం కంటే అత్యంత ఆనందకరమైనది వేరే ఏముంటుంది. శ్రీనివాసుడుఅ త్యంతద యామయుడు. త నభ క్తులుచే సేఅ తిచిన్న సేవకేఎ ంతో మురిసిపోయా సర్వం అనుగ్రహిస్తాడు. అయితే మానవులలో చాలామంది ఆ స్వామి గురించి తెలియక ఎప్పుడూ ప్రాపంచిక సుఖాలలో మునిగి తేలుతూ ధనం వెనుకే పరిగెడుతూ కాలం గడుపుతారు. లేనిపోని మోహాలు పెంచుకుంటారు. క్షణకాలం సుఖాన్నిచ్చే వస్తువులకోసమే ఆరాటపడుతుంటారు. చేసే ప్రతీ పాప పని ఈ జన్మలోనో, లేక వచ్చే జన్మలలోనో దుఃఖానికి కారణమవుతుందని గ్రహించరు. మరణం ఆసన్నమైనప్పుడు తాను అనుభవించిన సుఖాలు ఏమీ గుర్తుకు రావు, ఏ

సుఖమూ ఆ మరణబాధను తగ్గించలేవు. ఆ సమయంలో మనిషి పడే బాధ ఇంతా, అంతా అని వర్ణించలేము. కొంతమంది నెలల తరబడి దీర్ఘ వ్యాధులతో బాధపడుతూ వుంటారు. వారి బాధ వర్ణనాతీతము. బ్రతికినంతకాలం తానంతటి వాడు లేడనుకొని ప్రవర్తిస్తారు, చివరన అనేక బాధలు పడతారు. ఆ బాధను తట్టుకొనలేక చనిపోతే బాగుండునని తలుస్తారు. కానీ మరణం అంత తేలికగా రాదు. చుట్టు ప్రక్కల వున్న తమ కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు, అల్లుళ్ళు, భార్య, బంధువులు తన పరిస్థితి చూసి విసుక్కుంటూ వుంటారు. ఇంతకాలం ఎవరికోసమైతే తాను తాపత్రయపడ్డాడో వారందరూ తనని అసహ్యాసించుకుంటారు. ఆ సమయంలో అతనికి దైవప్రార్థన చేసే ఓపిక కూడా వుండదు. కాసేపు చెయ్యి నొప్పి పుడుతుంది. మరికాసేపు కాళ్ళు నొప్పి పడుతుంటాయి. ఒక్కోసారి కాళ్ళూ, చేతులు తేలిపోతున్నట్లు అనిపిస్తుంది. నోటమాట రాదు. కంటికి చూపు కూడా సరిగా కనపడదు. ఒక్కోసారి శరీరం విపరీతమైన బరువుగా అనిపిస్తుంది. మరొకసారి శరీరమంతా ఎవరో గట్టిగా నొక్కుతున్నట్లు అనిపిస్తుంది. ఈ విధంగా మానవులందరూ మరణసమయం ఆసన్నమయినపుడు అనేక రకాల బాధలకు లోనౌతారు. ఇటువంటి బాధలనుండి తప్పించుకోవాలంటే ఎల్లప్పుడూ శ్రీమన్నారాయణులవారి పాదాలను ఆశ్రయించటమే. అంతకుమించిన శరణాగతి మరొకటి లేదు. ఎవరైతే ప్రతీరోజు కనులు తెరవగానే శ్రీమన్నారాయణులవారి దివ్య పాదాలను మనస్సులో స్మరిస్తారో వారికి ఎటువంటి బాధలూ కలుగవు. అంత్యకాలంలో ఏ బాధా పడకుండా అతి తేలికగా నిష్క్రమిస్తారు. అటువంటివారికి మరణసమయమాసన్నమైనప్పుడు బాధలు కలుగకపోగా శరీరమంతా ఏదో తెలియని ఆనందంతో నిండిపోతుంది. ఎంతో ప్రశాంతంగా ఈ జీవితం చాలిస్తారు. మానవులందరూ ఈ విషయాన్ని గమనించి సత్ప్రవర్తనతో మెలుగుతూ, స్వామినే స్మరిస్తూ పుణ్యకార్యాలను చేస్తూ జీవించాలి. మనతోటి మానవులలో ఆ పరబ్రహ్మమూర్తినే చూడగలగాలి. చాలామంది రోజూ గంటల తరబడి పూజలు చేస్తుంటారు. శాస్త్ర ప్రవచనాలు వింటుంటారు. కానీ దైనందిన కార్యక్రమాల్లో

తోటివారిని పరుషపదాలతో నిందిస్తూ, దూషిస్తూ గడుపు తారు. ఈవిధంగా వుండటం వలన ఆ శ్రీనివాసుని అనుగ్రహం ఏమాత్రం కలుగదు అని చెప్పాడు.

భద్రయ్య భక్తులతో ఇంకా ఇలా చెప్పసాగాడు. పూర్వకాలంలో అవంతీనగరంలోని విష్ణాలయంలో కృష్ణమాచార్యులు అనే అర్చకుడు వుండేవాడు. అతను ప్రతినిత్యం స్వామి సన్నిధిలోనే గడుపుతున్నాననే గర్వంతో వుండేవాడు. ప్రతీ శని, ఆదివారాలలో ఆలయంలో జరిగే ప్రవచనాలన్నీ వినేవాడు. కేవలం రామాయణ, భారత ప్రవచనాలు వినడం వలన చాలా పుణ్యం వస్తుందని తలచేవాడు. అదే మాట గట్టిగా అరుస్తూ, భార్యా పిల్లలతో అనేవాడు. తాను మహానుభావుల దివ్య ప్రవచనాలు వింటూ ఎంతో పుణ్యం సంపాదిస్తున్నాను, నా వంటి పుణ్యాత్ముడు ఈ వూరిలోనే కాదు కదా, ఈ దేశంలోనే వుండడు అని ఎంతో గర్వంగా చెప్పేవాడు. ప్రవచనాలు వినడమే తప్ప ఏదీ ఆచరణలో పెట్టేవాడు కాదు. ఆలయానికి వచ్చే సామాన్య భక్తులను ఈసడించుకొనేవాడు. ఎప్పుడూ ఆలయ అధికారులనే పొగుడుతూ వారి సేవలోనే కాలం గడిపేవాడు. ఇలా ఎన్నో పాపకార్యాలు చేసి చివరి రోజుల్లో ఎన్నో అనారోగ్యాలకు గురై మరుజన్మలో కుక్కగా జన్మించాడు. అత్యంత దారుణమైన జీవితం అనుభవించాడు. పిల్లలు రాళ్ళు పెట్టి కొడితే శరీరమంతా పుండ్లు పడేది. ఊరంతా పరిగెడుతూ తినడానికి ఏదీ దొరకక దుర్భర పరిస్థితిలో జీవించి, చివరకు ఒక వాహనం కిందపడి మరణించాడు. అటు తరువాత జన్మలో అడవిలో సర్పంగా జన్మించాడు అని చెప్పాడు.

అప్పుడు భక్తులందరూ భద్రయ్యతో స్వామీ! మానవులు చేసే పాపాలు ఇంతటి దుర్భరమైన జీవితాలను ఇస్తాయా, మరింత వివరించవలసింది, ఈ పాపాలనుండి ఎలా విముక్తులము కాగలమో కూడా తెలియపరచవలసింది అని ప్రార్థించాడు. అప్పుడు భద్రయ్య వారితో ఇలా చెప్పసాగాడు. నాయనలారా! ఎనభై నాలుగు లక్షల జీవరాశులలోవ ూనవజన్మఎ ంతోఉ న్నతమైనది. ఎ ంతోవ్పుణ్యంచేసుకుంటేకానీ మానవజన్మ లభించదు. మనచుట్టూ వుండే కుక్కలు, పిల్లులు, కాకులు, పిచ్చుకలు, చిన్న చిన్న క్రిమి కీటకాలు, పాములు, తేళ్ళు... ఇలా అన్ని రకాల జీవరాశులు

# శ్రీచరణామృతము

మనుషులవంక దీనంగా చూస్తూ ఈ మానవులు ఎంత అదృష్టవంతులో కదా అని తలుస్తుంటాయి. ఈ మానవజన్మ తమకు లభిస్తే ఎంత అదృష్టమో కదా అని భావిస్తాయి. కానీ మానవుడు మాత్రం ఈ జన్మ విలువ గ్రహించడు. కృష్ణమాచార్యులు విషయంలో కూడా ఇదే జరిగింది. అనేక పాపాలు చేయడం వలన శునకజన్మ, తరువాత పాము జన్మ ఎత్తాడు. సర్పంగా జీవించి అడవులలో తిరుగుతూ, క్రిమికీటకాలను తింటూ కాలం గడిపాడు. ఎందరో మనుషులచేత దొడ్డు కర్రలతో దెబ్బలు తిని అనేక శరీర బాధలతో దుర్భర జీవితం గడిపాడు. చివరన ఒక ముంగిస ఎదురుపడి శరీరమంతా అనేకరకాలుగా హింసించగా ఆ బాధలకు తట్టుకొనలేక మరణించాడు. అటు తరువాత అడవిలో నక్కగా జన్మించాడు. ఆ నక్క కేవలం నాలుగు సంవత్సరాలుగా మాత్రమే జీవించి, నానా కష్టాలూ పడి చివరికి ఒక సింహం చేత సంహరించపడ్డాడు. అటు తరువాత జన్మలో ఒక చిన్న క్రిమిగా జన్మించాడు. జన్మించిన రెండు క్షణాలలోనే ఒక మానవుని కాలికింద పడి మరణించాడు. అటు తరువాత ఒక ఈగ రూపంలో జన్మించి, దుర్భరమైన ప్రదేశాలలో వాలుతూ, కేవలం ముప్పై రోజులలోనే మరణించాడు.

ఆ విధంగా కృష్ణమాచార్యులు దాదాపు మూడు వందల సంవత్సరాల పాటు రెండు వేల జన్మల తరువాత, ఒక పిచ్చుకజన్మ నెత్తాడు. పిచ్చుక జన్మలో కృష్ణమాచార్యులు ఒక ఆలయ ప్రాంగణంలో వుండే ఒక చెట్టుపై గూడు కట్టుకుని నివసించేవాడు. ఆలయానికి వచ్చే భక్తులందరినీ చూస్తుండగా కొన్ని రోజులకు అతడికి తన పూర్వజన్మ గుర్తుకు వచ్చింది. తాను చేసిన పాపకార్యాలన్నీ గుర్తుకు వచ్చాయి. అర్చకునిగా వుంటూ, శ్రీమన్నారాయణుల వారికి ఎంతో దగ్గరగా వుండి కూడా ఎందుకు అంతటి పాపకార్యాలు చేసానా అంటూ కుమిలిపోయాడు. ఎలాగైనా ఆ పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలను కున్నాడు. ప్రతిరోజూ ఒక చిన్న పుష్పాన్ని నోటికి కరుచుకుని ఎవరూ లేనప్పుడు గర్భగుడిలోని ఎగిరి వెళ్లి స్వామివారి పాదాలపై వేసి రివ్వున ఎగిరి వచ్చేసేవాడు. రోజూ ఉదయం అర్చకులు స్వామివారి పాదాలవద్ద అనేక పూలతో అర్చన చేసేవారు కాబట్టి ఈ విషయం ఎవరూ

గమనించేవారు కాదు. ఇలా దాదాపు మూడు సంవత్సరాల పాటు పిచ్చుక రూపంలో వున్న కృష్ణమాచార్యులు వీలున్నప్పుడల్లా పువ్వులను నోటికి కరుచుకుని స్వామి పాదాలవద్ద వదిలేవాడు. ఆ విధంగా శ్రీమన్నారాయణులవారికి పాదాలను అర్చించటం వలన ఆ పుణ్యఫలంచేత కృష్ణమాచార్యులకు తిరిగి మానవజన్మ లభించింది. ఉన్నతమైన సద్బ్రాహ్మణకుటుంబంలో జన్మించి, జీవించినంత కాలం ఎంతో సుఖంగా జీవించి, చివరన ముక్తిని పొందాడు. శ్రీ స్వామివారి పాదాల సేవాభాగ్యం అంతటి మహత్తరమైనది. అంతటి మహిమాన్వితమైనది. స్వామివారి దివ్య చరణాలను రోజులో కేవలం ఒక్కసారి తలచుకున్నా, ప్రార్థించినా, ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. స్వామి దివ్య పాదాల వద్ద ఒక్క పుష్పం వుంచినా, ఎన్నో జన్మల పుణ్యఫలం లభిస్తుంది. రోజూ తులసీదళాలతో స్వామివారి దివ్య పాదాలను అర్చించినవారికి సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి. బ్రతికినంత కాలం సుఖంగా బ్రతికి చివరన ముక్తిని పొందుతారని చెప్పాడు. భద్రయ్య చెప్పిన విషయాలు విని, భక్తులందరూ ఎంతో సంతోషపడి అతని వద్ద సెలవు తీసి ముందుకు సాగారు. రామాచారి భద్రయ్యను సాక్షాత్తూ సప్తఋషులలోని ఒకరైన అంగీరస మహర్షిగా గ్రహించాడు.

రామాచారితో సహా భక్తులందరూ శ్రీమన్నారాయణులవారి గుణగణాలను తలచుకుంటూ అయిదవకొండ పూర్తి చేసి ఆరవ కొండపై కాలు పెట్టారు. తిరుమల గిరులు అద్భుత సౌందర్యంతో మెరిసిపోతున్నాయి. భక్తులందరూ చుట్టూ వున్న ప్రకృతి సౌందర్యానికి పరవశిస్తూ, ఇంతకు మించిన అందం ఈ సృష్టిలో మరెక్కడా వుండదని తలుస్తూ గోవిందనామ స్మరణలో ముందుకు సాగుతున్నారు. సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే కొలువై వున్న ఈ తిరుమలగిరులు దివ్యంగా ప్రకాశించటంలో ఆశ్చర్యమేముంది. కొంచెం ముందుకు వెళ్ళిన తరువాత వారికి మరొక భక్త బృందం తోడైంది. అందరూ కలిసి దాదాపు నూటికి పైగా అయ్యారు. వారిలో కొందరు స్వామి గుణగణాలను మనసులో తలుచుకుంటూ నడుస్తున్నారు. మరికొందరు పక్కన వున్న భక్తునితో తనకు కలిగిన శ్రీ స్వామివారి దివ్య అనుభవాలను వివరిస్తున్నారు.

# శ్రీచరణామృతము

కొందరు మనస్సులో స్వామివారి నామాన్ని జపిస్తున్నారు. మరికొందరు చప్పట్లు చరుస్తూ భజనలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. కొందరైతే అద్భుతంగా గొంతెత్తి పాటలు పాడుతున్నారు. వీరందరూ వింత వింత వేషధారణలలో వున్నారు. రకరకాల దేశాలనుండి వచ్చిన వారవటంచేత వారి వేషభాషలు విచిత్రంగా వున్నాయి. అయినా అందరిదీ ఒకే ఆలోచన! ఒకే గమ్యం! ఒకే భావన! అందరి భావాలకూ ఆ శ్రీనివాసుడే గమ్యం! అందరి మనస్సులలోనూ మెదులుతున్నది ఆ శ్రీనివాసుడే! అందరి మనస్సులూ లగ్నమైనది ఆ పరబ్రహ్మమూర్తి పైనే!

ఈవిధంగా ముందుకు సాగుతున్నవారందరూ కొంతసేపు నడిచిన తరువాత ఒకచోట విశ్రమించారు. దగ్గరలో వున్న చెట్లనుంచి మధుర ఫలాలను శ్రీనివాసుని ప్రసాదంగా భావించి, స్వీకరించి తమ ఆకలి తీర్చుకున్నారు. కాసేపు విశ్రమించి తిరిగి నడక సాగిద్దామని నిశ్చయించుకోగా కొందరు సాధువుల గుంపు కొండ దిగి రావడం కనిపించింది. ఆ సాధువుల సమూహం వీరిని చేరగానే వీరందరూ లేచి నుంచుని వారికి నమస్కరించి ఇలా అన్నారు. ఓ మహానుభావులారా! మీకందరికీ ఇదే మా నమస్కారం. మీవంటి దివ్య పురుషుల దర్శనంతో మా జన్మ ధన్యమైనది. ఈ తిరుమల గిరులలో ఎందరో యోగులు, మహర్షులు, సాధువులు, వంటి దివ్య పురుషులు శ్రీమన్నారాయణులవారిని సేవిస్తూ కాలం గడుపుతుంటారని విన్నాము. వారు ఈ కొండలలో సామాన్యులమైన మావంటి వారికి కనిపించకుండా జీవిస్తుంటారని విన్నాము. వారిలో ఎవరైనా మాకు కనబడితే ఎంతో అదృష్టవంతులము కాగలము కదా అని తలుస్తున్నాము. ఇంతలో మీరు ఈ విధంగా రావటం మాకెంతో సంతోషాన్ని కలిగించింది. దయచేసి మమ్ములను ఆశీర్వదించి, శ్రీమన్నారాయణులవారి దివ్య వైభవాన్ని మాకు వివరింపవలసినదిగా ప్రార్థిస్తున్నాము అని ఆ సాధువులను వేడుకున్నారు.

అప్పుడు వారిలోని పెద్దవాడైన ఒక వృద్ధ సాధువు సంజ్ఞ చేయడంతో వారందరూ కూర్చున్నారు. వృద్ధ సాధువు వయస్సులో పెద్దవాడిగా కనిపిస్తున్నప్పటికీ ఎంతో దివ్య తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. అతడు భక్తులను

ఉద్దేశించి ఇలా అన్నాడు. నాయనలారా! శ్రీనివాసుని ప్రియ భక్తులారా! సర్వాంతర్యామి అయిన శ్రీమన్నారాయణులవారి తత్వం ఇది అని చెప్పడం ఎవ్వరి తరమూ కాదు. నాకు తెలిసినంతలో కొంతమేర మాత్రమే చెప్పగలను. సావధానంగా వినండి. ఎన్ని జన్మలెత్తినా, ఎన్ని శాస్త్రాలు చదివినా, ఆ స్వామి దివ్య తత్వాన్ని పూర్తిగా తెలుసుకొనగలగడం అసాధ్యం. నాకు తెలిసినంతలో మీకు వివరిస్తాను. ఆ స్వామి తత్వాన్ని కొంతైనా అర్థం చేసుకుంటూ మన జీవితాలు తరిస్తాయి. ఈ విశ్వంలోని సర్వ ప్రాణుల హృదయాలలోనూ అంతర్యామి స్వరూపంలో వున్నది ఆ పరబ్రహ్మమూర్తియే. అంతేకాదు ప్రపంచంలోని అన్నింటియందు అతని తేజస్సే ప్రకాశిస్తున్నది. గాలిలోను, ఆకాశంలోను, నీటిలోను, భూమిలోను, అగ్నిలోను, పర్వతాలయందును, చెట్లయందు, నదులయందు, సముద్రాలలోను, ఈ విధంగా సర్వ ప్రదేశాలయందు వున్నది ఆ మూర్తియే. సర్వభూతాలయందు వున్నది ఆ పరబ్రహ్మస్వరూపమే. అన్నింటియందు అంతర్లీనంగా వుంటూ వాటి వాటికి వారి వారి శక్తులను ప్రసాదిస్తున్నది ఆ స్వామియే. అతని అనుగ్రహంలేనిదే ఈ సృష్టిలోని ఏదీ ముందుకు సాగలేదు. అతని అనుగ్రహం లేనిదే ఈ సృష్టిలో ఏ ప్రాణీ జీవింపజాలదు. ఆ స్వామి అనుగ్రహం సంపాదించటం అతి తేలిక. ఉదయం కనులు తెరవగానే ఒక్కసారి మనసులో ఆ స్వామి దివ్య చరణాలను స్మరిస్తే వేయి అశ్వమేధయాగఫలం లభిస్తుంది. ఆ స్వామి పాదాల వద్ద ఒక పుష్పాన్ని ఉంచినట్లు మనస్సులో భావించినా, ఎంతో పుణ్యం కలుగుతుంది. ఆ స్వామి పాదాలనే ఎల్లప్పుడూ మనస్సులో నింపుకునేవారికి ఎటువంటి ఆపదలూ కలుగవు. నిత్యం ఎంతో ఆరోగ్యంగా వుంటూ, శరీరమంతా దివ్యతేజస్సుతో నిండి వున్నట్లు అనిపిస్తుంది. ఆ స్వామి దివ్యచరణాల మహిమ ఎంతటిదో అర్థం కావటానికి ఒక కథ చెపుతాను వినండి అని అన్నాడు.

ఆ సాధువు భక్తులను ఉద్దేశించి ఇలా చెప్పసాగాడు. పూర్వకాలంలో మగధ దేశంలో వెంకటయ్య అనే వడ్రంగి నివసించేవాడు. కులవృత్తి నిర్వరిస్తూ ఎంతో ప్రశాంత జీవితం గడుపుతుండేవాడు. వచ్చే కొద్ది సొమ్ములో కొంత తన

కుటుంబానికి వాడుకొని మిగిలిన సొమ్ము దాన ధర్మాలకు ఖర్చు పెట్టేవాడు. జీవితం ఎంతో సాఫీగా సాగిపోతున్న సమయంలో ఒక్కసారిగా అనుకోని అనారోగ్యం వచ్చి కుడికాలు అవిటిదయింది. ఎంతటివారికైనా పూర్వజన్మల కర్మఫలం అనుభవించక తప్పదు కదా అని తలుస్తూ జీవితం నెమ్మదిగా నెట్టుకురాసాగాడు. వెంకటయ్య దురదృష్టం కొద్దీ కొంతకాలానికి రెండవ కాలు కూడా అవిటిదయింది. ఇక నడవలేక చేతికర్రతోనే ఇంట్లో తిరుగుతుండేవాడు. అయినప్పటికీ భగవంతుని నిందించక ఇదంతా తన పూర్వజన్మ పాపఫలం అని తలచేవాడు. రెండు కాళ్లు బాగున్నప్పుడు రోజూ ఆలయానికి వెళ్ళి స్వామిని సేవించేవాడు. ఇప్పుడు ఇల్లు కదలలేని పరిస్థితి. ఉదయం లేవగానే స్వామి దివ్య చరణాలనే మనస్సులో నింపుకుని ప్రార్థించేవాడు. పుష్పాలతో ఆ దివ్య పాదాలనే పూజిస్తున్నట్లుగా భావించేవాడు. రోజులు ఇలా జరుగుతుండగా ఆ ఊరి దేవాలయానికి ఉత్సవాలు వచ్చాయి. అయ్యో ఈ అవిటితనంతో ఇల్లు కదిలి వెళ్ళలేనే? ఆ స్వామి ఉత్సవాలలో పాల్గొని స్వామివారి అనుగ్రహంపొందలేనేఅ నిబాధపడ్డాడు. ఉ త్సవాలలోచి వరిోజునస్వామివారి ఉత్సవ విగ్రహాలు ఊరిలోని వీధులన్నింటిలోను రంగ రంగ వైభవంగా ఊరేగిస్తారు. ఆ ఊరేగింపులో భాగంగా వెంకటయ్య ఇల్లు ఉన్న వీధికి కూడా స్వామి ఉభయదేవేరులతో కలిసి వచ్చాడు. బయట కోలాహలం విన్న వెంకటయ్య రెండు చంకల కింద కర్రలను ఆసరాగా పెట్టుకుని ఇంటి బయటకు వచ్చి గోడను ఆనుకుని నిలుచుని రెండు చేతులతో స్వామికి నమస్కరించాడు. అంతలో ఉత్సవమూర్తులు తన ముందుకు వచ్చాయి. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారి దివ్యమంగళ విగ్రహాలను చూసి పులకించిపోయాడు. కనులవెంబడి ఆనందబాష్పాలు కారాయి. ఈ జన్మకు ఈ భాగ్యం చాలుననుకున్నాడు. కాళ్ళు లేకపోతేనేం స్వామిని దర్శించడానికి కనులు వున్నాయి కదా అని సంతోషించాడు. ఇంతలో ఒక అద్భుతం జరిగింది.

ఒక్కసారిగా వచ్చిన గాలికి స్వామి పాదాలవద్ద వున్న పుష్పాల నుంచి ఒక పుష్పం ఎగిరి వెంకటయ్య శరీరంపై పడింది. శరీరానికి ఆ పుష్పం తగిలిన

మరుక్షణమే వెంకటయ్య అవిటితనం పూర్తిగా మాయమైంది. పూర్తి ఆరోగ్యవంతుడైనాడు. కాళ్ళకు మునుపటికంటే ఎక్కువ శక్తి వచ్చింది. ఆహా! స్వామీ నన్ను కరుణించావా, అనాథరక్షకా! ఆపద్బాంధవా! అంటూ ఆ శ్రీనివాసుని అనేక విధాల కొనియాడాడు. రోజు ఆ స్వామి పాదాలనే స్మరిస్తూ, ప్రార్థిస్తూ వుండిన పుణ్యంవలన ఆ స్వామి దివ్య పాదాలనుంచి వచ్చిన పుష్పం వచ్చి వెంకటయ్యపై పడింది. ఆ పుణ్యఫలంతో వెంకటయ్య అవిటితనంపోయి పూర్తి ఆరోగ్యవంతుడైనాడు. అటు తరువాత వెంకటయ్య జీవించినంత కాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందాడు అని చెప్పాడు ఆ వృద్ధసాధువు.

ఆ సాధువు ఇంకా ఇలా అన్నాడు. 'చూశారా నాయనలారా! శ్రీనివాసుని దివ్య పాద మహిమ! ఎంతటి పూర్వజన్మ పాఫ ఫలాలనైనా ఇట్టే తొలగింపచేసే ఉపాయం ఆ స్వామి పాదాల అర్చనే. బ్రహ్మదేవుడు సృష్టి ప్రారంభించే ముందు ఈ పాదాలనే సేవించాడు. నారద తుంబురులు నిత్యం కీర్తించేది ఈ దివ్య చరణమహిమలనే. సృష్టిలో ఏ దేవతలను ఏ విధంగా పూజించినా, చివరికి అది చేరేది ఈ దివ్య పాదాల చెంతకే! అష్ట దిక్పాలకులు, నవగ్రహ దేవతలు, తమ తమ శక్తులకై నిత్యం ఈ దివ్య పాదాలనే అర్చిస్తున్నారు. ఆ దివ్య చరణాలను క్షణమైనా వదిలి వుండలేక ఆదిశేషుడు ఎల్లవేళలా ఆ స్వామినే వెన్నంటి వుంటున్నాడు. సప్తసముద్రాలు ఆ దివ్య చరణాలను తమ నీటితో కడిగి పునీతులవ్వాలని వువ్విళ్ళూరుతున్నాయి. సప్తఋషులు ఎల్లవేళలా ఆ దివ్య పాదాల మహిమనే కీర్తిస్తున్నారు. సనక సనందనాది మహర్షులందరూ నిత్యం సేవిస్తున్నది ఆ దివ్య పాదాలనే. ఆ పాద మహిమ అంతటిది. కాబట్టి మీరందరూ నిత్యం ఆ దివ్య చరణాలనే స్మరిస్తూ, సేవిస్తూ స్వామి అనుగ్రహం పొందండి అని చెప్పాడు ఆ సాధువు. రామాచారితో సహా భక్తులందరిని ఆశీర్వదించి ఆ సాధువుల సమూహం ముందుకు కదిలి కొండ దిగి వెళ్లిపోయారు. కాసేపటికి రామాచారి ఆ వృద్ధ సాధువు సప్తఋషులలో ఒకరైన గౌతమ మహర్షిగా గ్రహించాడు.

భక్తులందరూ ఆ సాధువు చెప్పిన శ్రీమన్నారాయణులవారి దివ్య విశేషాలను

తలచుకుంటూ ముందుకు సాగారు. వీరిలో కొందరు ఇంతకు మునుపు అనేక తీర్థయాత్రలు చేశారు. అప్పుడు కనిపించిన శ్రమ, శరీర బడలిక ఇప్పుడు ఇంత ఎత్తైన కొండలను ఎక్కుతున్నప్పుడు కనిపిం చుటలేదు కాదు కదా, ఎక్కుతున్నకొద్దీ శక్తి ఇంకా ఎక్కువవుతున్నట్లు తోస్తున్నది. అంతేకాక మనస్సులు ఎంతో ఆనందంతో నిండిపోతున్నాయి. ఎంతోమంది దివ్య పురుషులు తమకు కనపడి అద్భుతంగా శ్రీమన్నారాయణులవారి దివ్య తత్వాన్ని వివరించడంచేత వారి మనస్సులలో స్వామివారిపై భక్తి ఇంకా ఎక్కువైంది. ఇలా కొండనెక్కుతుండగా ఒక్కసారిగా ఒక పులి జింకను తరుముతూ వీరికి ఎదురు వచ్చింది. ఆ దృశ్యం చూసినవారందరూ ఎంతో భయకంపితులయ్యారు. ఒక్కసారిగా ఆ స్వామినే ప్రార్థించారు. ఆ స్వామి పాదాలనే స్మరించారు. వెంటనే ఆ పులి జింకను వదిలి అడవిలోకి మాయమైంది. శ్రీనివాసుడు తమ మొర విని అనుగ్రహించినందుకు ఆ స్వామిని ఎన్నోవిధాల కీర్తించారు.

నీటిభయం నుంచి కానీ, అగ్ని భయం నుంచి కానీ, జంతు భయం నుండి కానీ, క్రిమికీటకాల భయం చేత కానీ ఇలా ఏవిధమైన భయం నుంచైనా తక్షణమే రక్షించేది ఆ స్వామి దివ్య చరణాలే. ఆ దివ్యపాదాలను శరణు వేడినవారు ముల్లోకాలలో ఎక్కడ వున్నా, ఎంత ఆపదలో వున్నా, క్షణంలో రక్షింపబడతారు. పూర్వంకాలంలో నారాయణభట్టు అనే భక్తుడు వుండేవాడు. అతడు స్వామిని ఎన్నోవిధాల కొలిచేవాడు. ఎల్లప్పుడు స్వామి నామస్మరణలోనే కాలం గడిపేవాడు. ఒకనాడు శ్రీమన్నారాయణులవారికి అతనిపై అనుగ్రహం కలిగి దర్శనం ఇచ్చాడు.

ఆ స్వామి దివ్యమంగళ మనోహర రూపం చూసిన నారాయణభట్టుకి ఎంతో ఆనందం కలిగింది. "ఓ శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! నీవంటి భక్తవత్సలుడు ఎవ్వరూ వుండరు. సర్వకాల సర్వావస్థలయందు నీయందే నా మనస్సు లగ్నం కలిగేలా అనుగ్రహించు తండ్రీ! నువ్వు తప్ప వేరే దైవం లేదు, నీవే నా సర్వస్వం. నీ దివ్యదర్శన భాగ్యంచేత నా జన్మ ధన్యమైనది, నీ దివ్యపాదాలను దర్శించిన నేను ఈ కంటితో ఈ ప్రపంచాన్ని చూడజాలను. నాకు ఇక కనుచూపు లేకుండా చేసి

# శ్రీచరణామృతము

ఎల్లప్పుడూ నీ పాదాలే నా కనులముందు మెదిలేలా అనుగ్రహించు అన్నాడు. భక్తుల కోర్కెలు ఎంతో విచిత్రంగా వుంటాయి. ఇక జీవితంపై మోహం లేదని, ముక్తి ప్రసాదించమని చాలామంది భక్తులు కోరతారు, కానీ నారాయణభట్టు కోరిక మరీ విచిత్రంగా వున్నది. ఆ స్వామిపై భట్టుకు అంతటి అలవిమాలిన భక్తి. అప్పుడు ఆశ్రితజన రక్షకుడైన శ్రీమన్నారాయణుడు నారాయణభట్టుతో ఇలా అన్నాడు. నాయనా! ప్రియభక్తా! నీ భక్తి నాకెంతో సంతోషం కలిగించింది. కానీ కనులు లేకపోతే నీవు ఎంతో బాధపడగలవు. నీకొక వరం ప్రసాదిస్తున్నాను. నీవు ఎప్పుడు కనులు మూసుకున్నా నా పాదాలే నీ కనులముందు మెదులుతాయి. ఎల్లప్పుడూ నా దివ్య మంగళ విగ్రహాన్నే దర్శించగలుగుతావు. సర్వకాల సర్వావస్థలయందు నీవు నా పాదాలనే దర్శిస్తూ వుండవచ్చును. నీవు ఏ వస్తువు యందు చూసినా, అందులో నా పాదాలే నీకు కనిపిస్తాయి అని అనుగ్రహించాడు. శ్రీ స్వామి వారి మాటలకు నారాయణభట్టు ఎంతో సంతోషపడి స్వామిని ఎన్నో విధాల కీర్తించాడు. అప్పుడు శ్రీమన్నారాయణులవారు అంతర్ధానమైనాడు. నారాయణభట్టు జీవించినంతకాలం సుఖంగా జీవించి, తాను చూసే ప్రతీదానిలోను ఆ స్వామి పాదాలనే దర్శిస్తూ జీవించి, చివరన ముక్తిని పొందాడు.

రామాచారి భక్తులతో కలిసి తిరుమలగిరులపై ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ముందకు సాగుతున్నాడు. కొంతదూరం వెళ్ళేటప్పటికి ఒక చోట చెట్టుకింద ఎంతో తేజస్సుతో వెలిగిపోతున్న ఒక పిల్లవాడు వేదం చదువుతూ కనబడ్డాడు. వయసులో చిన్నవాడైనా తేజస్సులో ఎంతో అద్భుతంగా ప్రకాశిస్తున్న అతనికి నమస్కరించాలని భక్తులందరి మనస్సులో ఆలోచన కలిగింది. అందరూ ఆ బాలుని వద్దకు వెళ్ళి నుంచున్నారు. అ ప్పుడుఆ బాలుడువేదపఠనంఆ పివీ రికిన మస్కరించాడు. తాన పేరు శ్రీధరాచార్యుడని ఇక్కడ దగ్గరలో గల వేద పాఠశాలలో వేదం నేర్చుకుంటున్నానని అన్నాడు. అప్పుడు రామాచారి అతనితో నాయనా! నీవు వర్ఛస్సులో సాక్షాత్తూ ఆ వైకుంఠనాథునివలె వున్నావు. ఎల్లవేళలా శ్రీనివాసుని చెంతనే నివసించే నీకు ఆ శ్రీమన్నారాయణులవారి దివ్య విశేషాలెన్నో తెలిసి వుండాలి.

దయచేసి మాకు కొన్ని విశదంగా చెప్పవలసింది అని వేడుకున్నారు. అప్పుడు ఆ బాలుడు శ్రీస్వామివారి దివ్య తత్వాన్ని ఈ విధంగా వర్ణింపసాగాడు. ఓ శ్రీమన్నారాయణుని ప్రియభక్తులారా! ఆనందనిలయంలో శ్రీనివాసుడు సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే. కలియుగంలో భక్తులందరిని అనుగ్రహించడానికై ఆ స్వామి ఇక్కడ శ్రీనివాసునిగా వెలిశాడు. తరతరాలుగా స్వామి తనను నమ్మినవారిని రక్షిస్తూ అనుగ్రహిస్తున్నాడు. త్రికరణశుద్ధిగాస్వామినేన మ్మినవారికిఎ టువంటిఆ పదలూ కలుగవు. సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి. సర్వజీవుల హృదయాలలోను అంతర్యామి స్వరూపంలో వున్నది ఆ పరబ్రహ్మమూర్తియే అని వివరంగా చెప్పాడు. శ్రీధరాచార్యులు చెప్పిన స్వామివారి విశేషాలను విని, ఎంతో సంతోషించి భక్తులందరూ గోవిందనామ స్మరణచేస్తూ ముందుకు సాగారు. రామాచారికి ఆ బాలుని సప్తఋషులలో ఒకరైన వశిష్ట మహర్షిగా గ్రహించాడు.

భక్తులందరూ ఆరవకొండనెక్కడం పూర్తి చేసి ఏడవ కొండపై కాలు పెట్టారు. కొంతదూరం నడిచిన భక్తులకు ఒక చిన్న హనుమంతులవారి ఆలయం కనిపించింది. అక్కడ ఒక సాధువు స్వామిని అర్చిస్తూ కనబడ్డాడు. భక్తులందరూ కాసేపు ఆగి హనుమంతునికి నమస్కరించారు. అప్పుడు ఆ సాధువు అందరినీ కూర్చొనమని చెప్పి వారికి తీర్థప్రసాదాలు అందజేశాడు. అప్పుడు భక్తుంలదరూ సాధువుకు నమస్కరించి శ్రీమన్నారాయణులవారి దివ్య విశేషాలను వివరింపవలసిందిగా అడిగారు.

అప్పుడు ఆ సాధువు భక్తులతో ఇలా అన్నాడు. నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! ఆ స్వామి దర్శనార్థం వెళుతున్న మీ అందరినీ చూస్తుంటే నాకెంతో ఆనందం కలుగుతున్నది. నా పేరు సహజానంద. నా వయస్సు ఇప్పుడు తొంభై సంవత్సరాలు. దాదాపు డెభ్బై సంవత్సరాల క్రితం ఇక్కడకు వచ్చాను. అప్పటినుంచి ఇక్కడనే వుండి స్వామి వారిని సేవిస్తూ కాలం గడుపుతున్నాను. పవనపుత్రుడు జన్మించింది ఈ కొండపైననే. సృష్టి మొత్తంలో ఇంతటి పవిత్రస్థలం మరెక్కడా కానరాదు. ఎన్నో జన్మల పుణ్యఫలం వలన మాత్రమే మీకు ఈ తిరుమల యాత్ర చేసే భాగ్యం లభించింది. స్వామిని దర్శించడానికి ఎన్నో జన్మల పుణ్యఫలం కావాలి.

# శ్రీచరణామృతము

ఆ శ్రీనివాసుని అనుగ్రహం వలననే మీరు ఈ యాత్ర చేయగలుగుతున్నారు. మానవులు ప్రతి ఒక్కరూ జన్మలో ఒక్కసారైనా తిరుమల యాత్ర సంకల్పించి శ్రీనివాసుని దర్శనం చేసుకోవాలి. అప్పుడే వారి జన్మ ధన్యమౌతుంది. మానవులు నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతుంటారు. లేనిపోని అపోహలతో మోహావేశాలతో మనస్సులో ఏ మాత్రం ప్రశాంతత లేకుండా జీవిస్తుంటారు. అన్ని బాధలకు కారణం ప్రతీ విషయంపై మోహం పెంచుకోవటమే.

మానవుడు ఎప్పుడూ తన భార్యా, పిల్లలకోసం నిరంతరం కష్టపడుతూ వారిని సంతోషపెట్టడానికై అనేక పాపకార్యాలను కూడా ఒడికట్టడానికి వెనుకాడడు. అందుకోసమై నిత్యం ఎన్నో అబద్ధాలు చెప్తుంటాడు. భార్యా పిల్లలయెడల ఎంతో అనురాగం పెంచుకుంటాడు. వారికి మాత్రం కష్టం కలిగినా అది తన అశక్తతే అనుకుంటాడు. కానీ ఈ బంధాలన్నీ శాశ్వతం కావని గ్రహించడు. భార్యా, పిల్లలు అందరూ వారి వారి పూర్వజన్మ ఫలాల వలన పుట్టినవారే. ఎవరెవరు కలిసి ఒకే విధమైన జీవితం గడపాలని రాసి వుంటే వారందరూ ఒక కుటుంబంలో జన్మిస్తారు. తల్లిగానో, తండ్రిగానో, పిల్లలుగానో జన్మిస్తారు. అంతకు పూర్వం ఎన్నో రకాల జన్మలలో వివిధ ప్రదేశాలలో జన్మించి, ఆ జన్మల పాప పుణ్య ఫలాలవలన ఈ జన్మలో ఒకరికి కొడుకుగానో, కూతురుగానో జన్మిస్తారు. మరలా వచ్చే జన్మలో మరోచోట, మరో రూపంలో జన్మనెత్తుతారు. ఇలా ప్రతీ జీవి అనేక వేల జన్మలనెత్తుతూ గానుగకు కట్టిన ఎద్దువలె సంసార బంధంలో తిరుగుతుంటాడు. అన్ని వేల జన్మలలో మధ్యలో ఒక జన్మలో మీకు తండ్రిగానో, తల్లిగానో, కుమారుడిగానో, కుమార్తెగానో జన్మించటం అనే ఒకేఒక్క జన్మ ఎంతటిది. ప్రతి జీవి జీవించే కొన్ని వేల జన్మలలో కేవలం ఒక్క జన్మ గడిపే కాలం ఎంత చిన్నది? ఇంత చిన్న బంధానికై మీరు ఇంత తాపత్రయం పడటం దేనికి. మునుపటి జన్మలో మీరివురు తండ్రీ కొడుకులు కారు కదా! లేక తల్లీ కూతుళ్ళు కాదు కదా! ఈ జన్మ తరువాత మీ కుమారుడు, కూతురు తిరిగి ఎన్ని జన్మలెత్తుతారో, ఏవిధమైన రూపంలో జన్మిస్తారో మీకు తెలుసునా? లేక వారు అటు తరువాత ఎన్ని జన్మలెత్తగలరో మీరు నిర్ణయించగలరా!

# శ్రీచరణామృతము

ఇంతకు మునుపు ఎన్నో వేల జన్మలెత్తినా ఆ జీవి తన జన్మ జన్మల కర్మఫలంగా ఇప్పుడు మీ ఇంట్లో జన్మించారు. ఈ జన్మ పూర్తయిన తక్షణం మరోజన్మలో వేరేచోట జన్మిస్తారు. అటు తరువాత అతడి కర్మఫలాన్ని బట్టి అనేక జన్మలలో అనేక రూపాలతో జన్మిస్తారు. కాబట్టి తల్లిగా, తండ్రిగా, కుమారుడిగా, కుమార్తెగా, మీ బాధ్యత మీరు నెరవేర్చాలి తప్ప లేనిపోని తాపత్రయాలు పడి మోహావేశాలకు లోనై అవినీతిపరులుగా జీవించి, అనేక పాప కార్యాలుచేస్తూ జీవించకూడదు. జన్మ జన్మల బంధాలనుంచి మిమ్ములను విడదీసేది ఆ శ్రీనివాసుని దివ్య చరణాలను ఆశ్రయించడమొక్కటే అని గ్రహించండి. శ్రీనివాసుని పాదపద్మాలను నిత్యం స్మరించేవారు ఈ జన్మ జన్మల బంధాల నుంచి బయటపడి మరు జన్మ లేకుండా ముక్తిని పొందుతారు అని చెప్పాడు.

సహజానందులవారు ఇంకా ఇలా చెప్పసాగారు. నాయనలారా! శ్రీనివాసుని ప్రియభక్తులారా! ఆనందనిలయంలోని శ్రీనివాసుని పాదదర్శనంతో మీ అందరి పాపాలు తొలగిపోతాయి. ఎంతో పుణ్యం లభిస్తుంది. స్వామివారి పాద దర్శన మహిమ ఇంతా అంతా అని చెప్పలేము. పూర్వకాలంలో వింధ్యదేశంలో కృష్ణాపురం అనే గ్రామం వుండేది. ఆ గ్రామంలో సుబ్బిశెట్టి అనే వర్తకుడు వుండేవాడు. అతడు చిన్నప్పటినుంచే ధాన ధర్మాలు చేస్తూ సత్ప్రవర్తనతో, దైవ చింతనతో జీవించేవాడు. సుబ్బిశెట్టికి యాభై సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికి పిల్లల పెళ్ళిళ్ళు జరిగి బాధ్యతలన్నీ తీరాయి. ఆశ్చర్యకరంగా ఇన్నాళ్ళు లేని లోభితనం సుబ్బిశెట్టికి ఇప్పుడు పట్టుకుంది. ఎవరైనా వయసు మీద పడిన తరువాత వేదాంత ధోరణి కలిగి, దానధర్మాలపై, సత్కర్మలపై దృష్టి పోతుంది. అటువంటి సుబ్బిశెట్టికి ఈ వయసులో, అదీ బాధ్యతలన్నీ పూర్తయిన తరువాత లోభత్వం వచ్చింది. తాను అమ్మే సరుకులను నెమ్మదిగా కల్తీ చేయడం ప్రారంభించాడు. కొంత కాలం క్రితం ఆ ఊరిలో దేవాలయం కట్టిస్తానని ఊరి పెద్దలకు మాటిచ్చాడు. ఇప్పుడది పూర్తిగా మరిచిపోయాడు. గ్రామంలోని కొందరు ధనికులు ఆలయం నిర్మించడానికి ముందుకు వచ్చి సుబ్బిశెట్టిని కూడా కొంతమేర సహాయం చేయమని అడిగారు. అందుకు సుబ్బిశెట్టి వారిని కసురుకుని తనకు రెండు సంవత్సరాలుగా అన్నీ నష్టాలే

తప్ప లాభాలు లేవని చెప్పి ఏ మాత్రం ధన సహాయం చేయలేనని చెప్పాడు. ఆ విధంగా తరువాత కొన్ని సంవత్సరాలపాటు ఏ మాత్రం దైవ చింతనలేక ఎప్పుడూ ధనం కూడ బెట్టడానికే ప్రయత్నిస్తూ అందుకు అనేక పాపకార్యాలకు ఒడిగట్టాడు. మరణించిన అనంతరం ఈ జన్మలో చేసిన పాపాల ఫలితంగా సుబ్బిశెట్టి మరుజన్మలో సింహళదేశంలో గాడిద జన్మనెత్తాడు. వీపుమీద ఎన్నో బరువైన మూటలు మోస్తూ నానా కష్టాలు పడ్డాడు. యజమాని చేత అనేక దెబ్బలు తింటూ జీవించినంతకాలం ఎంతోదయనీయస్థితిలో బ్రతికి మరుజన్మలో శునకంగా జన్మించాడు. ఈ జన్మలో కూడా ఎంతో దుర్భరమైన జీవితాన్ని గడిపాడు.

సాధారణంగా మానవులందరూ కొంచెం పుణ్యకార్యాలు చేయగానే ఎంతో గొప్పగా విర్రవీగుతారు. ఆ పుణ్యఫలం వలన మరుజన్మలో ఎంతో విలాసవంతమైన జీవితం లభిస్తుందని తలుస్తారు. అంతేకానీ కొన్ని వేల జన్మలలో చేసిన పాపాకార్యాలయొక్క ఫలం ఒక్క జన్మతో పోదని ఎన్నో జన్మల పుణ్యఫలం వలననే సాధ్యమవుతుందని గ్రహించరు. కొంతమంది పుణ్యకార్యాలకు ధన సహాయం చేస్తున్నామని దానివలన ఎంతో పుణ్యం వస్తుందని తలచి తన తోటివారిని ఎంతో హీనంగా చూస్తారు. ఎప్పుడు పరుషంగా మాట్లాడతారు. ఇటువంటి పనుల వలన ఆ పుణ్యం ఎందుకూ కొరగాకుండా పోతుందని గ్రహించరు. ఎన్నో జన్మలలో కష్టపడి సంపాదించిన పుణ్యఫలమంతా కేవలం ధర్మాత్ముడైన ఒక్క మనిషిని పరుషమాటలతో నిందిస్తే, పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందని గ్రహించరు. ఎన్నో యజ్ఞయాగాదులు చేసినవారు కూడా ఎవరినైనా అకారణంగా ఒక్కసారి దూషించినా ఆ పుణ్యఫలం మొత్తం ఒక్కక్షణంలో నశిస్తుంది.

సుబ్బిశెట్టి ఆవిధంగా తాను చేసిన పాపకార్యాలకు ఫలితంగా ఎన్నో దుర్భరమైన జన్మలెత్తుతూ కొన్ని వేల జన్మల తరువాత క్రిమిరూపంలో జన్మించి ఆ మొక్కలు, ఈ మొక్కలమీదా తిరుగుతూ ఒకనాడు ఒక పూలమొక్కపై పాకుతూ ఆ పైన వున్న పుష్పం వద్దకు చేరాడు. సరిగ్గా అదే సమయానికి ఒక భక్తురాలు శ్రీమన్నారాయణులవారి పూజ నిమిత్తం పుష్పాలను కోసుకుంటూ ఈ పుష్పాన్ని కూడా తెంపుకుని తన

పూలబుట్టలో వేసుకుంది. సుబ్బిశెట్టి అతిచిన్న క్రిమిరూపంలో ఈ పుష్పాన్ని అంటిపెట్టుకుని ఉండటంచేత ఆమె గమనించలేదు. పుష్పాలన్నింటినీ ఆ భక్తురాలు బుట్టలో వేసుకుని ఆ వూరిలో విష్ణాలయానికి వెళ్లి స్వామివారికి అర్చన చేయించే నిమిత్తం అర్చకులకు ఈ పూలనిచ్చింది. అప్పుడు ఆ అర్చకులు స్వామివారికి అష్టోత్తరం చదువుతూ స్వామి పాదాల వద్ద ఒక్కొక్క పువ్వను సమర్పించారు. అష్టోత్తరం పూర్తికాగానే మిగిలిన పువ్వులన్నింటినీ ఒక్కసారిగా స్వామిపాదాల వద్ద సమర్పించారు. అప్పుడు సుబ్బిశెట్టి క్రిమిరూపంలో వున్న పుష్పం కూడా స్వామి పాదాలపై పడి ఆ క్రిమికి శ్రీ స్వామివారి పాద స్పర్శ తగిలింది. అంతే! ఆ పరబ్రహ్మమూర్తి పాద స్పర్శచేత సుబ్బిశెట్టి చేసిన జన్మ జన్మల పాపాలు తొలగిపోయాయి. అక్కడితో ఆ జన్మ పూర్తయి మరుజన్మలో తిరిగి మానవునిగా ఎంతో నిష్టాగరిష్టులైన బ్రాహ్మణకుటుంబంలో జన్మించి జీవించినంత కాలం ఎంతో సత్ప్రవర్తనతో, దైవకార్యాలలో నిమగ్నమై జీవించి చివరన ముక్తిని పొందాడు. చూశారా! శ్రీమన్నారాయణులవారి పాదమహిమ అంతటిది. ఎన్ని జన్మలలో చేసిన పాపాలను అన్నింటినీ క్షణంలో కడిగివేసే శక్తి ఆ దివ్య చరణాలకు మాత్రమే సాధ్యం అని చెప్పాడు సహజానంద. భక్తులందరూ సహజానందుల వారి వద్ద శెలవు తీసుకుని ముందుకు సాగారు. రామాచారి సహజానందుని సప్తఋషులలో ఒకరైన అత్రి మహర్షిగా గ్రహించాడు.

రామాచారితో కలసి భక్తులందరూ శ్రీ స్వామి పుష్కరణిలో స్నానమాచరించి పక్కనే వున్న ఆలయంలో వరాహ స్వామిని దర్శించి ఆనందనిలయం వద్దకు చేరుకున్నారు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణులవారే శ్రీ వేంకటేశ్వరునిగా కొలువున్న ఆనందనిలయం బంగారు కాంతులతో ప్రకాశిస్తున్నది. రామాచారి దంపతులు శ్రీ స్వామివారినే ప్రార్థిస్తూ ఆనందనిలయంలోకి ప్రవేశించారు. ఎదురుగా వున్న దివ్య మంగళ మనోహర మూర్తిని చూసి ఆశ్చర్యపోయారు. మిగిలిన భక్తులందరూ అక్కడ వున్నది శిలామూర్తి అని భ్రమిస్తున్నప్పటికీ, రామాచారి దంపతులకు మాత్రం శ్రీనివాసుని దివ్యరూపమే దర్శనమిచ్చింది. ఆ అద్భుత దివ్య దర్శనానికి ఆ దంపతుల

నోట మాట రాలేదు. ఆహా! ఎంతటి రమణీయ రూపం! బంగారు పద్మ పీఠంపై ఠీవిగా వెలసిన ఆ దివ్య మంగళరూపుని చూడటానికి వేయి కనులున్నా చాలవు కదా. సహస్రనామ మాలలు, నందక ఖడ్గం, నడుమున వడ్డాణం... ఎంతటి మనోహర రూపం... ఈ సృష్టిలోని సర్వ అందాలూ ఆయనవే... బంగారు మొలతాడు... వజ్ర ఖచిత వరదహస్తం... తన పాదాలను వేడినవారికి ఎటువంటి ఆపదలు కలగవని చెప్తున్న వైకుంఠ హస్తం... తనను శరణువేడిన వారికి సంసారం మోకాలిలోతేనని అనుగ్రహిస్తున్న కటి హస్తం... బంగారు యజ్ఞోపవీతం... చేతులకు నాగాభరణాలు... శంఖ చక్రాలు... పవిత్ర సాలగ్రామ మాలలు... ఎంతటి అద్భుత దివ్య మనోహర రూపం ఆ శ్రీనివాసునిది !

ఆ స్వామి అద్భుతరూపం దర్శించిన రామాచారి దంపతులకు ఎంతో సంతోషం కలిగి స్వామిని ఈ విధంగా కీర్తించారు. ఈ పవిత్ర తిరుమలలో శ్రీ వేంకటేశ్వరునిగా వెలసిన శ్రీమన్నారాయణా, నీకు జయమగుగాక. నీకివే మా నమస్కారములు. మా సర్వస్వమూ నీవే తండ్రీ! నీవే నిత్యుడవు, నీవే విశ్వేశ్వరుడవు, నీవే విశ్వాత్మకుడవు. నీవే విశ్వ పరాయణుడవు. ఓ స్వామీ! నిన్ను యింద్రియములతోడగాని, శాస్త్ర పాండిత్యము వలన గానీ తెలుసుకొనలేము, ఏ ప్రమాణమునకు అందని వాడవు నీవే. ఓ శ్రీనివాసా! సమస్త జీవరాశుల ఇంద్రియ నియంత్రకునివి నీవే! ఊర్ధ్వ, అధో, మధ్య అనబడే మూడు దిక్కులకూ ఆశ్రయమైనవాడివి నీవే! కేవలం నీ నామ స్మరణచేతనే సర్వ పాపాలు నశిస్తాయి.

ఆనందము, తృప్తి, దుఃఖ రాహిత్యము, సౌలభ్యము, క్షేమము, స్వర్గము, ఇవన్నీ నీ నామ స్మరణవలననే తప్ప, మరే యజ్ఞ యాగాదుల వలననూ సాధ్యము కావు. భక్త సులభుడవు నీవే. ఓ శ్రీ వేంకటేశ్వరా నీ కీర్తి చతుర్దశ భువనములయందు వ్యాపించింది. ముక్కోటి దేవతలు నీ అనుగ్రహమునకై ఎదురుచూచుచున్నారు తండ్రీ! నీవు భక్త వత్సలుడవు. నీవు కళ్యాణగుణవిశిష్ట దివ్య మంగళ విగ్రహ రూపుడవు. జ్ఞాన స్వరూపుడవు. అర్చింపదగినవారలచే అర్చింపదగినవాడవు. ఓ శ్రీనివాసా! నీ నామ సంకీర్తనం వలన కలిగెడి ఆనందము, యజ్ఞము, తపస్సు,

# శ్రీచరణామృతము

దానము, తీర్థ యాత్రలు వంటి ఏ పుణ్య కార్యముల వలన లభించెడి ఆనందముకంటె వేయిరెట్లు స్వామి! ఓ పురుషోత్తమా నీకివే మా నమస్కారములు" అని ఆ దంపతులు శ్రీనివాసుని ఎన్నో విధాల కీర్తించి, అంతటి దివ్య దర్శనం తమకు అనుగ్రహించి నందుకు ఎంతో సంతోషపడ్డారు. సర్వకాల సర్వావస్థలయందు ఆ స్వామియందే మనస్సు లగ్నమయ్యేలా అనుగ్రహించమని ఎల్లవేళలా ఆ స్వామి దివ్యపాదాలే తమ మనస్సులలో వుండాలని ఆ స్వామిని వేడుకున్నారు. కొన్ని రోజులు పవిత్ర వేంకటాద్రిపైననే వుండి స్వామిని సేవిస్తూ గడిపారు. తరువాత వారి వూరికి వెళ్ళి జీవించినంత కాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందారు.

" శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ "



అజ్ఞానినా మయాదోషా నశేషాన్విహితాన్ హరే

క్షమస్వ త్వం క్షమస్వ త్వం శేషశైల శిఖామణే.



శ్రియః కాంతాయ కళ్యాణనిధయే నిధయేర్థినామ్
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్